**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 99, పేజీలు - 08

శుక్రవారం,అక్టోబర్ 09, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## కేబీఆర్ పార్క్ వన్‌వే ప్రయోగం విఫలమా.?

**- ప్రజాధనం వృథా.. నిర్ణయాలపై ప్రశ్నలు! - భవిష్యత్తు ట్రాఫిక్‌పై దీర్ఘకాలిక ఆలోచన ఎక్కడ?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోనే అత్యంత కీలకమైన కేబీఆర్ జాతీయ పార్క్ చుట్టూ ఉన్న జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ కారిడార్లలో ట్రాఫిక్ నివారణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ప్రారంభంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద వందల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 14 రకాల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల సజావుగా నిర్వహణ కోసమే ఆగస్టులో పార్కు చుట్టూ 'రౌండ్ ది పార్క్' వన్‌వే విధానాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పైలట్ ప్రాజెక్ట్‌గా అమల్లోకి తెచ్చారు. అయితే, ఈ వన్‌వే అమల్లోకి వచ్చిన తర్వాత ట్రాఫిక్ రద్దీ సడలిపోవడంతో అసలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రతిపాదనలనే పక్కనబెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

### వందల కోట్ల ప్రణాళికలపై ఇప్పుడు ప్రశ్నలు

ఈ ఊహించని యూ-టర్న్ నిర్ణయం ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు అర్బన్ ప్లానర్లు కూడా పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కేవలం వన్‌వే విధానంతోనే ట్రాఫిక్ తగ్గుతుందని 2లో..

## సైబర్ ఫ్రాడ్‌ను అడ్డుకునేందుకు అంతర్జాతీయ వ్యవస్థ కావాలి

**- టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకే 'డిజిటల్ ఇండియా'**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జరిగిన ఒక ప్రధాన ప్రయత్నంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. సాంకేతికత అనేది డిజిటల్ అంతరాన్ని తగ్గించి, కేవలం వనరులు ఉన్న కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతీ ఒక్కరికీ అందాలనేదే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పరివర్తనలో మొబైల్ ఫోన్‌ను కేంద్ర బిందువుగా మార్చడం ద్వారా సాధారణ పౌరులకు కూడా అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని 2లో..

## దేశాన్ని రెండు వర్గాలుగా విభజించారు

- ఓటమి భయంతో ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్
- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్
- ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్



హైదరాబాద్/ న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో 2లో..

## భారీగా కొత్త ఓటర్ల దరఖాస్తులు

**- 4.88 లక్షల అప్లికేషన్లు నమోదు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫామ్-6 దరఖాస్తులు అందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్-6ఏ దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు వంటి 2లో..

## ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ

**- అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక పరిస్థితిపై చర్చ!**

- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రతిపాదన
- 2027 గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి
- రాష్ట్రంలో వర్షాభావం, వ్యవసాయ సంక్షోభంపై ప్రధానికి వివరణ
- విశాఖ మెట్రో, అమరావతి ఓఆర్ఆర్‌కు సహకారం కోరిన సీఎం



అమరావతి / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల హస్తిన పర్యటనలో భాగంగా గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర ముఖ్య మంత్రులతో వరుసగా సమావేశమయ్యారు. ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో జరిగిన ఈ భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర విభజన హామీలు, మౌలిక వసతుల కల్పన, అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్, విశాఖ బీచ్ కారిడార్ మరియు కేంద్రం నుంచి రావాల్సిన వివిధ ఆర్థిక సహాయాలపై ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు లోతుగా చర్చించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కేంద్రం అందిస్తున్న నిరంతర సహకారానికి ప్రధానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఢిల్లీ పర్యటనలో 2లో..

## బీసీలే మా వెన్నెముక.. వారి రిజర్వేషన్లలో రాజీ లేదు

**- 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామన్న లోకేశ్**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై మంత్రి నారా లోకేశ్ క్లారిటీ ఇచ్చారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంగా సత్తా చాటడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సందర్భంగా వైసీపీపై ఆయన విమర్శలు గుప్పించారు. బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయకుండా ఎలా అభ్యర్థులను ప్రకటిస్తామని ప్రశ్నించారు. నెల్లూరు మేయర్ అభ్యర్థిని వైసీపీ ప్రకటించడాన్ని.. అవగాహన రాహిత్యమన్నారు. తాము బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తామని, తెలుగు దేశం పార్టీకి బీసీలే వెన్నెముక అని లోకేశ్ అన్నారు.

### ఈ నెలలోనే స్థానిక ఎన్నికలు జరిగే ఛాన్స్.?

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబర్ అంటే ఈ నెలలోనే ఉండే అవకాశం ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ ఎన్నికలు పూర్తైన తర్వాత నియామక పదవులపై కూడా దృష్టి సారిస్తామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ.. ఇప్పుడు స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించిందని ఆరోపించారు.బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాధాన్యతను దూరం చేసేందుకు ఆ పార్టీ పెద్ద కుట్ర చేస్తుందని ఆరోపించారు. 2లో..

## తెలంగాణలో మండుతున్న ఎండలు

**- పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు 2లో..

## ఐటీ దిగ్గజ కంపెనీలపై అమెరికా కొరడా

**- గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!**



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికాలో పనిచేస్తున్న వేలాది మంది విదేశీ ఉద్యోగులకు, ముఖ్యంగా భారతీయులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. హెచ్-1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులకు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డు) కల్పించే ప్రక్రియలో కీలకమైన 'శాశ్వత కార్మిక ధ్రువీకరణ (పెర్మ్)' కార్యక్రమం నుంచి మైక్రోసాఫ్ట్, అడోబ్‌తో పాటు పలు భారత ఐటీ దిగ్గజ కంపెనీలను సస్పెండ్ చేస్తున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ జాబితాలో కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, క్యాప్‌జెమినీ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ఈ నిర్ణయంతో అమెరికా కార్మిక శాఖ ఇకపై 2లో..

## ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన

- జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు
- ప్రభుత్వ చర్యపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు
- రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

2లో..



## కాంగ్రెస్ నేతల లోక్‌భవన్ ముట్టడి

**- టీపీసీసీ చీఫ్, మంత్రులకు పోలీసుల అడ్డుకట్ట**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చిన చలో లోక్ భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి.నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ లోక్ భవన్ వైపు దూసుకెళ్లింది. 2లో..

## నానా పటేకర్ కన్నుమూత

**- గుండెపోటుతో నివాసంలో మృతి**



**గోవా (ప్రశ్న న్యూస్)** ప్రముఖ బాలీవుడ్ నటుడు నానా పటేకర్ (75) కన్నుమూశారు. గోవాలోని తన నివాసంలో గురువారం (అక్టోబర్ 8) తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచారు. ఇంట్లో అపస్మారక స్థితిలో కనిపించడంతో, వెంటనే ఆయన్ను వైద్య సహాయం కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు 45 నిమిషాల పాటు నిరంతరాయంగా సీపీఆర్ చేసినప్పటికీ ఆయనను కాపాడలేకపోయారు. నానా పటేకర్ గురువారం ఉదయం 5:20 గంటలకు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయన మృతిపట్ల సినీ రాజకీయ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. నానా పటేకర్ 1951 జనవరి 1న జన్మించారు. ఆయన అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. 1978లో 'గమన్' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. హిందీతో పాటుగా మరాఠీ చిత్రాలతోనూ గుర్తింపు తెచ్చుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న నానా.. కెరీర్ ప్రారంభం నుంచే కథా బలమున్న 2లో..

# కేబీఆర్ పార్క్ వన్‌వే ప్రయోగం విఫలమా.?

తెలియడానికి వందల కోట్ల రూపాయల అంచనా వ్యయాలు, ప్రణాళికలు ఎందుకు రూపొందించారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రాజెక్ట్ పేరుతో పార్క్ చుట్టుపక్కల ఇప్పటికే అనేక చెట్లను నరికివేయడం, రోడ్లను తవ్వేయడం, మౌలిక వసతులను ధ్వంసం చేయడం వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని విమర్శలు వస్తున్నాయి. సరైన ముందస్తు అధ్యయనం లేకుండా నిధులు వెచ్చించి పనులు ప్రారంభించి, ఇప్పుడు సింపుల్ పరిష్కారం లభించిందని చెప్పి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టడం అనాలోచిత విధానానికి పరాకాష్ట అని విపక్షాలు, అర్బన్ ప్లానర్లు మండిపడుతున్నారు.

### భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలకు ఈ విధానం సరిపోతుందా?

మరోవైపు పౌరులు, వాహనదారుల నుంచి కూడా ఈ వన్‌వేపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రౌండ్ తిరగడం వల్ల కొన్ని జంక్షన్ల వద్ద సిగ్నల్ రహిత ప్రయాణం సాగుతున్నప్పటికీ, చిన్న దూరాలకు కూడా కిలోమీటర్ల కొద్దీ చుట్టూ తిరగాల్సి రావడంతో అదనపు సమయం, ఇంధనం వృథా అవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు యూ-టర్న్ల వద్ద కొత్త తరహా ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయని నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వన్‌వే వల్ల ట్రాఫిక్ కొంత సర్దుబాటు అయినా, భవిష్యత్ హైదరాబాద్ ప్రజావసరాలకు ఇది సరిపోతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్యను బట్టి చూస్తే రాబోయే 5 నుంచి 10 ఏళ్లలో కేబీఆర్ పార్క్ చుట్టూ వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. సాధారణ పోలీస్ ఆర్గనైజ్డ్ వన్‌వే లూప్ తాత్కాలిక ఊరటనిస్తుందే తప్ప, పెరుగుతున్న భవిష్యత్తు నగర అవసరాలకు ఇది శాశ్వత పరిష్కారం కాదని రవాణా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

### నగర ప్రణాళికపై నమ్మకం సడలుతోందా?

ముందస్తు ఆలోచనలు లేకుండా నిర్ణయాలను పదేపదే సవరించుకోవడం వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్లానింగ్ తీరుపై కూడా నమ్మకం సడలుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ప్రజాధనం వృథా కాగా, మరోవైపు భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా మౌలిక వసతుల నిర్మాణం నిలిచిపోవడం వల్ల దీర్ఘకాలంలో నగర ప్రజలే నష్టపోతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు ఎప్పుడు?

ప్రభుత్వం ఇప్పటికైనా తాత్కాలిక సర్దుబాట్లతో సరిపెట్టకుండా, పర్యావరణాన్ని కాపాడుతూనే భవిష్యత్తు వాహన రద్దీని తట్టుకునేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. సింగిల్ ఎలివేటెడ్ కారిడార్ వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించడంతో పాటు, లోతైన శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో ప్రస్తుత 'వన్‌వే ప్రయోగం' ప్రజాధనాన్ని వృథా చేసిన మరో విఫల వ్యూహంగా చరిత్రలో మిగిలిపోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## సైబర్ ఫ్రాడ్‌ను అడ్డుకునేందుకు అంతర్జాతీయ వ్యవస్థ కావాలి

అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన పదో ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)లో ఈ మేరకు ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.ప్రభుత్వ పథకాల పంపిణీలో మొబైల్ ఫోన్లు, డిజిటల్ కనెక్టివిటీ పోషిస్తున్న పాత్రను ప్రధాని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా రూ.50 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ అయ్యాయని అన్నారు. ఆ డబ్బు తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా నివారించడం ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా చేశామని వివరించారు. వందలాది ప్రభుత్వ సేవలు ఇప్పుడు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు లింక్ అయిన బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అవుతున్నాయని వెల్లడించారు."ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు లింక్ అయిన బ్యాంకు ఖాతాలకు రూ. 50 లక్షల కోట్లు చేరాయి. తత్ఫలితంగా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా అయ్యాయి. ఈ మొత్తం తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా నివారించాం. ఇలాంటి అవకతవకలను అరికట్టే ప్రయత్నాలను కొనసాగించడానికి నేను కట్టుబడి ఉన్నాను. పీఎం కిసాన్ కింద రూ. 4 లక్షల కోట్లను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశాం. ఈ డబ్బు వారి ఖాతాలో జమ అయినప్పుడు రైతుల మొబైల్ ఫోన్‌లకు నోటిఫికేషన్ వస్తుంది. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను గతంలో పొందలేని కోట్లాది మంది చిన్న రైతులకు ఈ డబ్బు అందింది. మొబైల్ ఫోన్ ఇకపై కేవలం సమాచార మార్పిడి లేదా చాటింగ్ సాధనం మాత్రమే కాదు. ఇది పౌరులకు తక్కువ ప్రయాణం, తక్కువ నిరీక్షణ, తక్కువ ఖర్చు, ఎక్కువ సౌకర్యాన్ని కల్పించింది" అని మోదీ వ్యాఖ్యానించారు.టెలికాం రంగంలో భారత్ సాధించిన ప్రగతిలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. గత కొన్నేళ్లుగా ఈ వేదిక దేశ ప్రగతిని, దాని ఆకాంక్షలను ప్రతిబింబించే ఒక వేదికగా ఆవిర్భవించిందని అభిప్రాయపడ్డారు. గత దశాబ్ద కాలంలో దేశ టెలికాం మౌలిక సదుపాయాల విస్తరణను కూడా ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. ఇందులో భాగంగా మారుమూల ప్రాంతాలలో సెల్ టవర్ల ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ల విస్తరణ, డేటా మరింత అందుబాటులోకి రావడం వంటి అంశాలను వివరించారు.

### మోసాలపై వరల్డ్‌వైడ్ ఫ్రేమ్‌వర్క్ ఉండాలి : మోదీ

సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ నేరాలను ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్త చట్రం (ఫ్రేమ్‌వర్క్) కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. డిజిటల్ మోసాలు దేశ సరిహద్దులను దాటాయని, అందుకే సంబంధిత వర్గాలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు. డిజిటల్ మోసాలను అరికట్టడానికి ప్రభుత్వాలు, టెక్నాలజీ కంపెనీలు, టెలికాం ఆపరేటర్లు, ఆర్థిక సంస్థలు యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల నమ్మకాన్ని పొందినప్పుడే టెక్నాలజీ విస్తృత స్థాయికి చేరుకోగలదని అభిప్రాయపడ్డారు.

### ఐఎంసీపై సింధియా ప్రశంసలు

భారత్‌కు ప్రపంచ సాంకేతిక ఆశయాలను ముందుకు నడిపించడానికి అవసరమైన మానవ వనరులు (మ్యాన్‌పవర్, చలనశీలత(మొబిలిటీ), దృక్పథం(మైండ్‌సెట్) ఉన్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అభిప్రాయపడ్డారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) దేశ సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి ప్రదర్శించే వేదికగా పరిణామం చెందాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకే డేటా అందిస్తున్న దేశాల్లో భారత్ ఒకటిగా ఉందని అన్నారు. బ్రాడ్‌బ్యాండ్ చందాదారుల సంఖ్య దశాబ్దం క్రితం కేవలం 6 కోట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 110 కోట్లు దాటిందని చెప్పారు.

# దేశాన్ని రెండు వర్గాలుగా విభజించారు

రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది.

ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు.ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# తెలంగాణలో మండుతున్న ఎండలు

నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది.

రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# భారీగా కొత్త ఓటర్ల దరఖాస్తులు

అంశాల కోసం 5,04,782 ఫామ్-8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనల కోసం ఫామ్-7లు కూడా వేల సంఖ్యలో వచ్చాయి. ఫామ్-7 ద్వారా ఇప్పటికే ఉన్న ఓటరు పేరును తొలగించాలన్న అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనను దాఖలు చేయవచ్చు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7వ తేదీతో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి నవంబర్ 5వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఆ తర్వాత నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ముందుగానే ప్రకటించింది.జిల్లాల వారీగా చూస్తే కొత్త ఓటు నమోదు కోసం అత్యధిక దరఖాస్తులు హైదరాబాద్ జిల్లా నుంచి వచ్చినట్లు ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 1,93,135 ఫామ్-6 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 29,226 దరఖాస్తులు ఇప్పటికే ఆమోదం పొందినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ జిల్లా నుంచి 4,127 మంది ఎన్‌ఆర్‌ఐలు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 ఫామ్-8 దరఖాస్తులు అందాయి. ఓటర్ల తొలగింపు అంశంలో హైదరాబాద్ జిల్లా కూడా చర్చనీయాంశంగా మారింది. ఫామ్-7ల దాఖలాపై హైదరాబాద్ నగరంలో రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఇటీవల బల్క్‌గా సమర్పించిన ప్రీ-ఫిల్డ్ ఫామ్-7ల వ్యవహారం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉందని తాజా రిపోర్టులు సూచిస్తున్నాయి. ఇప్పటికే కోట్లాది మంది ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. నవంబర్ 9వ తేదీన వెలువడే తుది జాబితాతో రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ వివరాల్లో మార్పులు కోరినవారు తుది జాబితా ప్రచురణ తర్వాత.. తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు.

## ఐటీ దిగ్గజ కంపెనీలపై

# అమెరికా కొరడా

భాగంగా సీఎం చంద్రబాబు కేవలం ప్రధానితోనే కాకుండా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతోనూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితి, కేంద్ర-రాష్ట్ర సమన్వయం, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన భద్రతాపరమైన అంశాలపై అమిత్ షాతో చర్చలు జరిపారు. ఏపీ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన హోంశాఖ, కేంద్రం నుంచి అన్ని రకాల మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చింది.అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయి రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు నిర్దేశిత సమయానికి పూర్తి చేసేందుకు నిధుల విడుదల వేగవంతం చేయాలని, రూ. 30,000 కోట్లతో చేపట్టిన జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార పనులకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వీటికి తోడు, గోదావరి-కావేరి అనుసంధానంతో పాటు దక్షిణ భారతదేశంలోని ఐదు ప్రధాన నదుల గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి అనుసంధానంపై సీఆర్ పాటిల్‌కు సవివరమైన ప్రణాళికను అందించారు. పర్యటనలో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌తో కలిసి సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. నవంబర్ 12--13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల ప్రాతినిధ్యాన్ని ఆహ్వానించారు. మరోవైపు, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై జాతీయ రహదారుల విస్తరణ, విశాఖ-భోగాపురం బీచ్ కారిడార్ మరియు వివిధ ఎక్స్‌ప్రెస్ వేల అనుమతులపై విజ్ఞప్తులు సమర్పించారు. సీఎం చంద్రబాబు జరిపిన ఈ రెండ్రోజుల హస్తిన పర్యటన ఏపీ ప్రయోజన సాధన దిశగా అత్యంత సానుకూలంగా సాగింది. ప్రధానమంత్రి మోదీ మొదలుకొని కీలక శాఖల కేంద్ర మంత్రుల వరకు అందరితో జరిపిన చర్చలు రాష్ట్రాభివృద్ధికి, మౌలిక వసతుల నిధుల సమీకరణకు కొత్త ఊపునిచ్చాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇది ప్రజా పాలన కాదు..

# ప్రజా పీడన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జూరాల సాగునీటి అంశం మరోసారి తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయంటూ జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వనపర్తి జిల్లా పరిధిలోని జూరాల కాలువకు నీటిని విడుదల చేసుకున్న 14 మంది రైతులపై కేసులు నమోదైనట్లు అమరచింత ఎస్సై స్వాతి వెల్లడించారు. ప్రాజెక్టు ఇరిగేషన్ డీఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రైతులపై కేసులు నమోదు చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. పంటలు ఎండిపోతుంటే సాగునీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడం సరికాదని విమర్శించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ రైతులు, వివిధ పార్టీల నాయకులు జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులను నీటిని విడుదల చేయాలని కోరినా స్పందన లేకపోవడంతో సెప్టెంబర్ 19వ తేదీన సాయంత్రం కొందరు రైతులు స్వయంగా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 19, 20వ తేదీల్లో జరిగిన ఆందోళనలకు సంబంధించి కేసులు నమోదు అయ్యాయి. జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపైనా కేసులు నమోదు చేశారు.రైతులపై కేసులు నమోదు చేయడంపై హరీశ్‌రావు తన ఎక్స్ అకౌంట్ ద్వారా స్పందించారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే వాటిని కాపాడుకునేందుకు జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. 'కళ్ల ముందే ఎండుతున్న పంటలకు జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన బాట పట్టిన రైతులపై కేసులు నమోదు చేయడం అత్యంత హేయమైన చర్య' అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని హరీశ్ రావు ఆరోపించారు.

నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే కడుపు మండిన రైతులు రోడ్డెక్కి ప్రశ్నిస్తే వారిపై కేసులు ఎలా పెడతారని ఆయన నిలదీశారు. జూరాల నీటిని విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇంజినీర్లతో రైతులపై కేసులు పెట్టించడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు.కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు ఉన్న సమయంలో నీటిని లిఫ్ట్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని హరీశ్‌రావు ఆరోపించారు. నీటిని సద్వినియోగం చేసుకోకుండా వదిలేయడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని ఆయన అన్నారు. 'తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సాగునీరు, విద్యుత్ సమస్యలపై రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కేసులు పెట్టడం సరికాదన్నారు. 'ఇది ప్రజా పాలననా.. లేక ప్రజా పీడననా?' అంటూ హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ఇదే వైఖరిని కొనసాగిస్తే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జూరాల ఆయకట్టు రైతులపై కేసులు నమోదు చేయడాన్ని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి కూడా ఖండించారు. జూరాల డ్యాం వద్ద ఉద్రిక్త పరిస్థితులకు ప్రభుత్వ వైఖరే కారణమని ఆయన విమర్శించారు. కృష్ణా జలాలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే రైతులు ఆందోళనకు దిగాల్సి వచ్చిందని లక్ష్మారెడ్డి ఆరోపించారు. పంటలు ఎండిపోతుంటే రైతులు ఆవేదనతో ధర్నా చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు.

రైతులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఒకవైపు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చేయడం, మరోవైపు అనుమతి లేకుండా జూరాల కాలువ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసుకున్నారనే ఫిర్యాదుతో కేసులు నమోదు కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రైతుల చర్యపై పోలీసులు కేసు నమోదు చేయగా.. సాగునీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టడాన్ని బీఆర్ఎస్ నేతలు తప్పుబడుతున్నారు. దీంతో జూరాల సాగునీటి వ్యవహారం రాజకీయంగా కూడా మరింత వేడెక్కుతోంది.

# బీసీలే మా వెన్నెముక.. వారి రిజర్వేషన్లలో రాజీ లేదు

### 34 శాతం బీసీ రిజర్వేషన్ వివాదం ఏమిటీ?

34 శాతం బీసీ రిజర్వేషన్ అంశం కొత్తదేమి కాదు.. గతంలో ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవి. అంటే 1994లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయడం జరిగింది. ఈ మేరకు 1995, 2001, 2006, 2013 మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చే మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు గతంలో ఓ తీర్పు ఇచ్చింది. దీంతో ఏపీలో ఎస్సీ, ఎస్టీల జనాభా ఆధారంగా.. బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాల్సి వచ్చింది. 50 శాతం లిమిట్‌ని దాటకూడదనే కోర్టు రూల్ వల్ల.. వైసీపీ ప్రభుత్వం సమయంలో పంచాయతీ, మున్సిపల్ ఎలక్షన్స్‌లో రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయం వల్ల స్థానిక సంస్థల్లో బీసీలకు వేలాది పదవులు దూరమయ్యాయి అనే విమర్శలు వచ్చాయి.అప్పటి నుంచి ఈ 34 శాతం రిజర్వేషన్ల అంశం ఏపీ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారింది. మళ్లీ కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతామని ప్రకటించింది. దీంతో వివాదం మళ్లీ రాజుకుంది. అయితే ఈ అంశం ఇప్పుడు సుప్రీంకోర్టులో ఉంది.

# నానా పటేకర్ కన్నుమూత

చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. ఎలాంటి పాత్ర అయినా అందులోకి పరకాయ ప్రవేశం చేయడం ఆయన స్పెషాలిటీ. నానా నటిస్తారనడం కన్నా జీవిస్తారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పాత్ర ఎంత పెద్దదైనా, ఎంత చిన్నదైనా దానికి జీవం పోయడం నానాకు మాత్రమే సాధ్యమైన విద్య. కోపం, కరుణ, ఆవేదన, నిస్సహాయత.. ఇలా ఏ భావమైనా ఆయన దగ్గర కృత్రిమంగా అనిపించేది కాదు. ఓవైపు సీరియస్ రోల్స్ చేస్తూనే, మరోవైపు కామెడీ పాత్రల్లో మెప్పించడం ఆయనకే చెప్పింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయి. 1989లో 'పరిందా' సినిమాలో నానా పటేకర్ నటనకుగానూ ఉత్తమ సహాయ నటుడిగా నేషనల్ ఫిలిం అవార్డు అందుకున్నారు. సినిమా, కళారంగాలలో ఆయన చేసిన కృషికి గాను 2013లో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. నానా పటేకర్ స్ట్రెయిట్ తెలుగు సినిమాలు చేయకపోయినా, డబ్బింగ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. పా.రంజిత్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా నటించిన 'కాలా' సినిమాలో ఆయన విలన్ గా నటించారు. అలానే భారతీరాజా డైరెక్షన్ లో నానా నటించిన 'బొమ్మలాట్టం' చిత్రం తెలుగులో 'రాణా' పేరుతో రిలీజ్ అయింది. నానా చివరగా 'ఓ రోమియో', 'సుబేదార్' వంటి హిందీ సినిమాలలో కనిపించారు.నానా పటేకర్ ఆకస్మిక మరణంతో సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. తన విలక్షణ నటనతో, డైలాగ్ డెలివరీతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నానాకి సినీ అభిమానులు ఘన నివాళులు అర్పిస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నారు.

# ఐటీ దిగ్గజ కంపెనీలపై అమెరికా కొరడా

ఈ కంపెనీల నుంచి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించదు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించదు. అయితే, ఈ చర్యల ప్రభావం ప్రస్తుత హెచ్-1బీ వీసాలపై ఉండదని, కేవలం గ్రీన్ కార్డు మంజూరు ప్రక్రియపైనే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కంపెనీలలో పనిచేస్తున్న విదేశీయులు గ్రీన్ కార్డు పొందడం ఇకపై దాదాపు అసాధ్యంగా మారనుంది.ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ, ముఖ్యంగా మైక్రోసాఫ్ట్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. "అమెరికాలో ఈ వ్యవస్థను మైక్రోసాఫ్ట్ కంటే ఎక్కువగా ఎవరూ దుర్వినియోగం చేయలేదు. ఆ సంస్థ సుమారు 6,000 మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించి, దాదాపు 6,300 హెచ్-1బీ వీసాలు, 3,000 గ్రీన్ కార్డులు పొందింది. ఇది అమెరికన్ల స్థానంలో విదేశీ బానిసలను నియమించుకోవడమే" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్‌లింగ్ మాట్లాడుతూ, 2009 నుంచి ఈ కంపెనీలు దాదాపు 30 లక్షల మంది విదేశీ కార్మికుల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వాటిలో 2,30,000 హెచ్-1బీ వీసాలు, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సంస్థలు మోసాలకు పాల్పడుతూ, తక్కువ వేతనాలకు విదేశీయులను నియమించుకుని అమెరికన్ల ఉద్యోగాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సబ్‌పోనలు జారీ చేశామని, పలు ఫెడరల్ ఏజెన్సీలు దర్యాప్తు చేస్తున్నాయని వెల్లడించారు. మరోవైపు, విద్యార్థి వీసాల దుర్వినియోగం ఆరోపణలపై హార్వర్డ్, యేల్, స్టాన్‌ఫోర్డ్ సహా తొమ్మిది విశ్వవిద్యాలయాలపై కూడా ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించినట్లు ప్రకటించారు.

### ఏమిటీ పెర్మ్ ప్రోగ్రాం?

అమెరికాలో ఒక విదేశీ ఉద్యోగికి గ్రీన్ కార్డు స్పాన్సర్ చేయాలంటే, సదరు ఉద్యోగానికి తగిన నైపుణ్యం, అర్హతలున్న అమెరికన్ పౌరులు ఎవరూ అందుబాటులో లేరని యజమాని నిరూపించాలి. దీనికోసం చేపట్టే ప్రక్రియే పెర్మ్. ఇది ఆమోదం పొందాకే గ్రీన్ కార్డు కోసం తదుపరి దశ అయిన I-140 పిటిషన్‌ను దాఖలు చేయడానికి వీలవుతుంది. తాజా సస్పెన్షన్‌తో ఈ కంపెనీలకు ఆ మార్గం మూసుకుపోయింది. ఈ నిషేధం ఎప్పటివరకు కొనసాగుతుందనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

# కాంగ్రెస్ నేతల లోక్‌భవన్ ముట్టడి

వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు లోక్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరసన తెలుపుతున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి మరియు కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అరెస్టుల అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడటంలో సిఇసి విఫలమయ్యారని ఆరోపించారు. పారదర్శకమైన రీతిలో ఎన్నికల వ్యవస్థ సాగాలంటే సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయించడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ చర్యలు ముమ్మాటికీ అక్రమమని, అప్రజాస్వామికమని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టి పారదర్శకమైన ప్రక్రియను చేపట్టే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ కాంగ్రెస్ స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం వీధిపోరాటాలు చేస్తుందని తేల్చిచెప్పింది. ముట్టడి నేపథ్యంలో రాజ్‌భవన్, లోక్ భవన్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా భద్రతను పెంచారు.

## ఏరియా ఆసుపత్రికి రూ.15 లక్షల కంప్యూటర్లు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తి: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి స్థానిక కోకాకోలా పరిశ్రమ యాజమాన్యం రూ.15 లక్షల విలువైన 15 కంప్యూటర్ సిస్టమ్‌లను అందజేసింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళికి శుక్రవారం వాటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.పేదలకు మెరుగైన ఉచిత వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ సేవలను బలోపేతం చేసేందుకు కంప్యూటర్లు అందించిన కోకాకోలా పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.రూ.72 లక్షల ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగంశ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.72 లక్షల ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగంపై విజయవాడకు చెందిన ప్రత్యేక ఆడిట్ కమిటీ విచారణ పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. గత ఆగస్టు 28న ఆసుపత్రికి వచ్చిన ఆడిట్ బృందం రికార్డులను పరిశీలించిందన్నారు. ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన లక్ష్మీ ప్రసన్న నిధులను దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. దుర్వినియోగమైన మొత్తంలో ఇప్పటికే రూ.22 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ.50 లక్షల రికవరీ కోసం శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదై దర్యాప్తు కొనసాగుతోందన్నారు ఈ వ్యవహారంతో ఆసుపత్రి వైద్యులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యంపై అసత్య ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లు ఎక్కడ.?

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికే ప్రాధాన్యమా.?
- రేవంత్ సర్కార్ లో బీసీలకు అన్ని రంగాలలో మొండి చెయ్యి
- బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్
- సామాజిక న్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీసీ వర్గాలు




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలోని బీసీ వర్గాలకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. 2027 మార్చిలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఇద్దరు అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి సామ రామ్మోహన్‌రెడ్డి, నల్గొండ--ఖమ్మం--వరంగల్ నియోజకవర్గానికి రామరెడ్డి సర్వోత్తమరెడ్డిని అభ్యర్థులుగా పార్టీ ప్రకటించింది.రెండు స్థానాలకు ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడంపై బీసీ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ చర్చ సాగుతోంది. అయితే అభ్యర్థుల ఎంపికకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ప్రకటనలో సామాజిక వర్గ ప్రాతిపదికను పేర్కొనలేదు.

### బీసీలకు ప్రాతినిధ్యం ఎప్పుడు.?

తెలంగాణ రాజకీయాల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం పెరగాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశం కూడా రాష్ట్ర రాజకీయాల్లో కీలక చర్చగా కొనసాగింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులు, ఆర్డినెన్స్, ఉత్తర్వుల అంశం కోర్టు, రాష్ట్రపతి ఆమోద ప్రక్రియలతో ముడిపడి ఉందని గతంలో నివేదికలు వెలువడ్డాయి.ఇలాంటి పరిస్థితుల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వంటి విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతకు సంబంధించిన నియోజకవర్గాల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం ఎందుకు కల్పించలేదనే ప్రశ్నను బీసీ సంఘాలు, మేధావులు, విద్యావంతులు లేవనెత్తుతున్నారు.

### బీసీల ఓట్లు మాత్రమేనా.. ప్రాతినిధ్యం వద్దా.?

ఎన్నికల సమయంలో బీసీల మద్దతు కోరుతూ, రాజకీయ నిర్ణయాల్లో మాత్రం తగిన ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీసీ వర్గాలకు రాజకీయ అవకాశాలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో ప్రాతినిధ్యం, పార్టీ పదవుల్లో భాగస్వామ్యం వంటి అంశాలపై స్పష్టమైన విధానం ఉండాలని బీసీ వర్గాలు కోరుతున్నాయి.అదే సమయంలో, ఈ అంశాన్ని ఒక సామాజిక వర్గంపై వ్యతిరేకతగా కాకుండా అన్ని వర్గాలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే సామాజిక న్యాయ డిమాండ్‌గా చూడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి.

### బీసీలు మేల్కొనేది ఎప్పుడు.?

రాజకీయ పార్టీలు ఏ అభ్యర్థిని ఎంపిక చేయాలనేది ఆయా పార్టీల నిర్ణయం. అయితే తమ రాజకీయ ప్రాతినిధ్యం, హక్కులు, అవకాశాల విషయంలో బీసీ వర్గాలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేయాల్సిన అవసరం ఉందనే వాదన ముందుకు వస్తోంది.బీసీ సంఘాలు, విద్యావంతులు, ఉద్యోగులు, యువత, సామాజిక కార్యకర్తలు కలిసి తమ డిమాండ్లపై చర్చించి, అన్ని రాజకీయ పార్టీల నుంచి బీసీలకు తగిన ప్రాతినిధ్యంపై స్పష్టమైన హామీ కోరాలని పలువురు సూచిస్తున్నారు.

### రాజకీయ పార్టీలకు ఒక ప్రశ్న

బీసీలకు జనాభా పరంగా, సామాజికంగా, రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు రాజకీయ పార్టీలు తీసుకునే చర్యలు ఏమిటి? బీసీలకు కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా నిర్ణయాధికారంలో భాగస్వాములుగా స్థానం కల్పించేందుకు పార్టీలు సిద్ధంగా ఉన్నాయా.?ఈ ప్రశ్నలకు రానున్న రోజుల్లో రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం ఇద్దరు అభ్యర్థుల మధ్య పోటీ మాత్రమే కాకుండా, సామాజిక ప్రాతినిధ్యం, రాజకీయ భాగస్వామ్యం, బీసీలకు దక్కాల్సిన అవకాశాలపై విస్తృత చర్చకు వేదికగా మారే అవకాశం ఉంది.

## అగ్రహారంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

- బార్‌కోడ్, శాటిలైట్ మ్యాపింగ్‌తో భూ రికార్డుల్లో పారదర్శకత..



**రేణిగుంట** రేణిగుంట ఆర్. అగ్రహారంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీరేణిగుంట, అక్టోబర్ 8: రేణిగుంట మండలం ఆర్. అగ్రహారం గ్రామంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 11:30 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులైన రైతులకు స్వయంగా పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టి, అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో హక్కు పత్రాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.నూతన పట్టాదారు పాస్ పుస్తకాల్లో బార్‌కోడింగ్, శాటిలైట్ మ్యాపింగ్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. బార్‌కోడ్ ద్వారా భూమికి సంబంధించిన సమగ్ర వివరాలను శాటిలైట్ అనుసంధానంతో తెలుసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. భూమి లాటిట్యూడ్, లాంగిట్యూడ్, దిశ, ఆకారం, సర్వే నంబర్ తదితర వివరాలు స్పష్టంగా నమోదవుతాయని పేర్కొన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. ప్రభుత్వ పత్రాలు, వస్తువులపై వ్యక్తిగత ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షాల వల్ల కాలువల్లో మురుగునీరు నిలవకుండా చెత్తచెదారం తొలగిస్తున్నాం

- కమిషనర్ ఎం.జయకృష్ణ.



**తిరుపతి** వర్షాలు కురుస్తున్న తరుణంలో నగరంలో ఎక్కడా మురుగునీరు నిలిచి అపరిశుభ్రత నెలకొనకుండా డ్రైనేజి కాలువల్లో చెత్తా చెదారం లేకుండా తొలగిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. నగరంలోని నారాయణ పురం వద్ద డ్రైనేజి కాలువలో చెత్తచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు ఎక్కువగా ఆగిపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని ప్రజల నుండి పిర్యాదులు అందాయని తెలిపారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా నగరంలో సిల్ట్ తొలగింపు పనులు చెపట్టామని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో నగరంలో ఎక్కడా మురుగునీటి కాలువల్లో నీరు నిలవకుండా చెత్తచెదారం తొలగించే పనులు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే నారాయణ పురం వద్ద కూడా డ్రైనేజీ కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి, వర్షపు నీరు, మురుగునీరు సజావుగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, ఇంచార్జి డిసిపీ మూర్తి, ఏసీపీ పార్వతి ప్రియ, తదితరులు ఉన్నారు.

## రోడ్డుపై నవజాత శిశువు కలకలం

**కూకట్ పల్లి** బాలానగర్లో అప్పుడే పుట్టిన మగ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాలానగర్ వైన్ షాప్ సమీపంలో కండువాలో చుట్టి శిశువును వదిలి వెళ్లినట్లు గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో శిశువును ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శిశువు ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు. అనంతరం శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# దసరాకు సర్వం సిద్ధం

# సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యం..

**రూ.100, రూ.300,**
**రూ.500 దర్శన టికెట్లు రద్దు**
**రూ.1,000తో శీఘ్ర దర్శనం.. 18 వేల మందికి హోల్డింగ్ కేంద్రాలు**
**8,500 మందికి క్యూ సామర్థ్యం..**
**వర్షాలకు ప్రత్యామ్నాయ మార్గం సిద్ధం**







విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. అక్టోబరు 11 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో సామాన్య భక్తుల సౌకర్యానికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. దర్శనం, క్యూలైన్లు, రవాణా, భద్రత, తాగునీరు, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

### ఉచిత దర్శనమే ప్రధానంగా..

ప్రభుత్వ నిర్ణయం మేరకు రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లను రద్దు చేశారు. క్యూలైన్లలో వచ్చే సామాన్య భక్తులకు ఉచిత దర్శనం కల్పిస్తారు. ఎక్కువసేపు క్యూలో నిలబడలేని భక్తుల కోసం రూ.1,000 శీఘ్ర దర్శనం అందుబాటులో ఉంటుంది. అధికారిక పోర్టల్, 'మన మిత్ర' వాట్సాప్ ద్వారా టికెట్లు పొందిన భక్తులను కుమ్మరిపాలెం కేంద్రం నుంచి దేవస్థానం వాహనాల్లో ఓం టర్నింగ్ వరకు తరలించి ప్రత్యేక క్యూ మార్గం ద్వారా దర్శనానికి అనుమతిస్తారు.పూజా టికెట్లు ఉన్న భక్తులకు పూజ అనంతరం రథం సెంటర్ ఫ్లైఓవర్ కిందనున్న ఫుట్‌బ్రిడ్జి మీదుగా కాలువ ఒడ్డుకు తీసుకెళ్లి, అక్కడి నుంచి వాహనాల్లో కుమ్మరిపాలెం చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

### క్యూలో 8,500 మందికి స్థానం

వినాయక టెంపుల్, కెనాల్ రోడ్డు, టోల్‌గేట్ మీదుగా భక్తులను అనుమతిస్తారు. రద్దీ పెరిగితే వన్‌టౌన్ వినాయక గుడి నుంచే ప్రవేశం ఉంటుంది. వినాయక మందిరం నుంచి సుమారు 1,650 మీటర్ల పొడవున క్యూ మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఒకేసారి 8,500 మంది వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు.వర్షాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో టోల్‌గేట్ మార్గాన్ని మూసివేయాల్సి వస్తే కనకదుర్గానగర్ మీదుగా మహామండపం ర్యాంపు వైపు భక్తులను మళ్లిస్తారు. ఈ ప్రత్యామ్నాయ మార్గంతో మరో 500 మందిని కలుపుకొని మొత్తం 9 వేల మందిని నిలిపి ఉంచే వీలుంది.

### మూడు హోల్డింగ్ కేంద్రాలు

దూర ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో వచ్చే భక్తుల కోసం మూడు భారీ హోల్డింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీతమ్మవారి పాదాల వద్ద, విద్యుత్ శాఖ--నగరపాలక సంస్థ కార్యాలయాల పరిసరాల్లో, పాత పూల మార్కెట్ వద్ద ఖాళీ చేసిన రైల్వే స్థలంలో వీటిని ఏర్పాటు చేశారు.70 కంపార్ట్‌మెంట్లుగా విభజించిన హోల్డింగ్ కేంద్రాల్లో ఒకేసారి 18 వేల మంది వేచి ఉండవచ్చు. 70 సీసీ కెమెరాలు, పెద్ద తెరలు, మైకులు ఏర్పాటు చేశారు. పోలీసులు, దేవస్థానం సిబ్బంది సమన్వయంతో భక్తులను విడతలవారీగా క్యూలైన్లలోకి పంపుతారు. నిరీక్షించే వారికి తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, అల్పాహారం అందిస్తారు.వర్షాలు, తుపాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు. భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ నిర్దేశించిన మార్గాల్లోనే రాకపోకలు సాగించి ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించిన ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్




**పాములపాడు** మండలంలోని, జూటూరు గ్రామంలో గౌరవ ఎంపీడీఓ ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, బిన్ బ్యాగ్ విధానం, "దసరా ధమాకా ఆఫర్", అలాగే చెత్త సేకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చే ఐ వి ఆర్ ఎస్ కాల్స్‌పై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జూటూరు గ్రామంలోని, ఎస్ డబ్ల్యూపిసి షెడ్‌ను ఎంపీడీఓ ఎన్.చంద్రశేఖర్ సందర్శించి అక్కడ జరుగుతున్న వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ వ్యర్థాలను సక్రమంగా వినియోగించి నాణ్యమైన వర్మీ కంపోస్ట్ తయారు చేయడం ద్వారా వ్యర్థాలను సంపదగా మార్చే విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు.దసరా ధమాకా ఆఫర్‌దసరా ధమాకాలో భాగంగా ఇంటి నుంచి 10 కిలోల కంటే ఎక్కువ పొడి చెత్తను అందించిన వారు కూపన్ తీసుకుని లక్కీ డిప్‌లో పాల్గొనవలసిందిగా తెలియజేయడమైనది. లక్కీ డిప్‌లో విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందించబడతాయనీ అన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పొడి చెత్తను సేకరణ వాహనాలకు అందించాలని అధికారులు సూచించారు.పాములపాడు ఐకేపీ భవనంలో అవగాహన సదస్సుఅనంతరం పాములపాడు గ్రామంలోని ఐకేపీ భవనంలో పొదుపు సంఘాల మహిళలకు తడి చెత్త?పొడి చెత్తను వేరు చేయడం, బిన్ బ్యాగ్ సిస్టమ్, దసరా ధమాకా ఆఫర్, అలాగే చెత్త సేకరణపై ప్రభుత్వం నుంచి వచ్చే ఐవిఆర్ఎస్ కాల్స్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా అందించి, చెత్త సేకరణ కార్యక్రమానికి సహకరించాలని అధికారులు సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.తడి చెత్త ? పొడి చెత్త వేరు చేద్దాం, బిన్ బ్యాగ్ విధానాన్ని పాటిద్దాం, చెత్తను సంపదగా మార్చుదాం,మన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం అని ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు.దఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ తో పాటు డిప్యూటీ ఎంపీడీఓ తిరుపాలు, ఈవో పిఓఆర్డి సులోచన, ఐకేపీ అధికారులు ఏ.ఉమామహేశ్వరి, పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి, పంచాయతీ కార్యదర్శులు క్రాంతి కుమార్, సలాం, ఆశ వర్కర్లు, పొదుపు సంఘాల మహిళలు, ఆయా గ్రామాల ప్రజలు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో భూ రీ సర్వే





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే లో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని ఘట్ కేసర్ మండలం మాదారం కీసర మండలం నర్సంపల్లి గ్రామాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి పర్యవేక్షించారు. పాసుబుక్కులోని భూ ఆధార్ నంబర్ తో ఆన్ లైన్ లో లోకేషన్ గుర్తించడం జరుగుతుందని ఆయా మండల తహాసీల్దార్లు అదనపుకలెక్టర్ కు వివరించారు. అదనపు కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. భూ సర్వే జరుగుతున్న రైతులతో మాట్లాడి సర్వేయర్లకు సూచనలు అందించారు. ఈ పర్యటనలో ఘట్కేసర్ తాహాసిల్దారు చంద్రశేఖర్, కీసర తహాసీల్దారు యాదగిరిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎల్ బరిలో ఆసియాడ్ హీరోలు

## - నేటి నుంచి హైదరాబాద్లో రెండో సీజన్

ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్ ఆతిథ్యానికి హైదరాబాద్ సిద్ధమైంది. ఆసియా క్రీడల్లో పతకాల మోత మోగించిన భారత స్టార్లతో పాటు పలు దేశాలకు చెందిన 48 మంది మేటి ఆర్చర్లు మొదలయ్యే మెగా లీగ్లో తమ గురితో అదరగొట్టనున్నారు. నెక్లెస్ రోడ్ లోని పీపుల్స్ ప్లాజా వేదికగా ఈనెల 18 వరకు జరిగే టోర్నీలో ఆరు జట్లు బరిలో నిలిచాయి. తొలి రోజు మూడు మ్యాచ్లు జరగనున్నాయి. గత సీజన్ ఫైనలిస్టులు రాజ్పుతానా రాయల్స్, పృథ్వీరాజ్ యోధాస్ ఆరంభ పోరులో తలపడతాయి. తర్వాతి మ్యాచ్లో కాకతీయ నైట్స్-మైటీ మరాఠాస్, చెరో ఆర్చర్స్ - చోళ చీఫ్స్ ఢీకొంటాయి. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ ఆర్చర్ తానిపర్తి చికిత చోళ చీఫ్స్ తరఫున బరిలోకి దిగనుంది. తొలి సీజన్ ఏపీఎల్ అనుభవం ఈ ఆసియాడ్లో రెండు స్వర్ణాలు నెగ్గడానికి తనకు ఎంత గానో ఉపయోగపడిందని ఆమె చెప్పింది. ఇప్పుడు సొంత గడ్డపై ఆడుతుండటం ఆనందంగా ఉందని, ఈ పోటీలను చూసి మరింత మంది చిన్నారులు, యువత ఆర్చరీని ఎంచుకోవాలని ఆశించింది. బుధవారం జరిగిన లీగ్ అధి కారిక గీతం, మస్కట్ ఆవిష్కరణ కార్య క్రమంలో చికిత పాటు ఆరు ఫ్రాంచైజీ ఆర్చర్లు, లీగ్ డైరెక్టర్ అనిల్ కామినేని పాల్గొన్నారు.

### కరువు మండలం గా ప్రకటించాలని

# రెండవ రోజు నిరవధిక నిరసన దీక్షలు

**కౌతాళం** స్వచ్ఛందంగా రైతులు నిరావధిక నిరసన దీక్షలో పాల్గొని మద్దతు తెలపాలని వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకో వాలని వైఎస్సార్సీపీ, వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు వైఎస్సార్సీపీ, సీపీఎం, రైతు కూలీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో గురువారం కౌతాళంలో రెండవ రోజు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల నాయకులు ప్రహ్లాద చారి పీఏ వెంకటరామరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మల్లయ్య. జగదీష్ బుజ్జి స్వామి, వెంకటరమరాజు, పాల్ దినకర్ బిమేష్, ఉపేంద్ర,మహీంద్రా మొహమ్మద్, తెలుగు గంగమ్మ తదితరులు మాట్లాడు తూ.. వర్షాభావ పరిస్థితులతో పంటలు సాగు చేసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెట్టుబడులు పెరిగి రైతులపై అప్పుల భారం అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పంటల బీమా కోసం రైతుల నుంచి డబ్బులు కట్టించుకుని, వారిని ఆదుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను ప్రభుత్వం గుర్తించి తక్షణమే కరువు మండలం గా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో సీట్లు ముగ్గురు పంచుకున్నారే గాని మండలంను కరువు మండలం గా ప్రకటించలేక నాయకులు, అధికారులు విఫలమయ్యారని మరొక్కసారి రైతులు పై కనికరం చూపాలని కలెక్టర్ కు విన్నవించు కుంటున్నామని కోరారు.ఈ కార్యక్రమం లో వైయస్ వైయస్ఆర్సీఎస్ నాయకులు వామపక్షాలు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు భారీగా కార్యకర్తలు తరలివచ్చారు.

### నిద్ర అవసరం: నిద్ర అంటే విశ్రాంతి మాత్రమే కాదు

**- డాక్టర్ డి.సి. తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు:**

**- చైతన్య హాస్పిటల్**

**కరీంనగర్**కడాక్టర్ డి.సి. తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ మాట్లాడుతూ మన శరీరానికి ఆహారం, నీరు ఎంత అవసరమో నిద్ర కూడా అంతే అవసరం. రోజంతా పనిచేసిన శరీరానికి, మెదడుకు నిద్ర ఒక సహజమైన విశ్రాంతి. సరైన నిద్ర లేకపోతే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ప్రభావితమవుతుంది.నిద్రలో శరీరానికి ఏమి జరుగుతుంది?మనం నిద్రిస్తున్న సమయంలో శరీరం విశ్రాంతి తీసుకోవడమే కాకుండా అనేక ముఖ్యమైన పనులు చేస్తుంది. మెదడు రోజంతా సేకరించిన సమాచారాన్ని క్రమబద్ధీకరిస్తుంది. కణజాలాల మరమ్మతు, కండరాల పునరుద్ధరణ, రోగనిరోధక వ్యవస్థ పనితీరు వంటి ప్రక్రియలు కొనసాగుతాయి. అందుకే మంచి నిద్ర తర్వాత ఉదయం శరీరం తేలికగా, మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.నిద్ర వల్ల కలిగే ప్రయోజనాలు:సరైన నిద్ర జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. మానసిక ఒత్తిడి, చిరాకు తగ్గుతాయి. రోగనిరోధక శక్తికి కూడా నిద్ర సహకరిస్తుంది. బరువు నియంత్రణ, రక్తపోటు మరియు రక్తంలో చక్కెర నియంత్రణ వంటి అంశాల్లో కూడా మంచి నిద్రకు ప్రాధాన్యత ఉంది.ఎంతసేపు నిద్రపోవాలి?సాధారణంగా పెద్దలకు రోజుకు సుమారు 7–9 గంటల నిద్ర అవసరం. వయస్సు, ఆరోగ్య పరిస్థితి, రోజువారీ శారీరక శ్రమను బట్టి అవసరం కొంత మారవచ్చు. ముఖ్యంగా వృద్ధులు కూడా ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం వంటి క్రమబద్ధమైన అలవాటును పాటించడం మంచిది.మంచి నిద్ర కోసం పాటించాల్సినవి:ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, ఒకే సమయానికి లేవడం అలవాటు చేసుకోవాలి. పడుకునే ముందు మొబైల్ ఫోన్, టీవీ వంటి స్క్రీన్ల వినియోగాన్ని తగ్గించాలి. రాత్రి ఆలస్యంగా ఎక్కువగా తినడం, కాఫీ లేదా టీ ఎక్కువగా తీసుకోవడం నివారించడం మంచిది.

పడుకునే గది ప్రశాంతంగా, చీకటిగా, సౌకర్యవంతమైన ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి.పగటి నిద్ర ఎంతవరకు?పగటిపూట ఎక్కువసేపు నిద్రపోతే రాత్రి నిద్రకు ఆటంకం కలగవచ్చు. అవసరమైతే చిన్న కునుకు తీసుకోవచ్చు. అయితే ప్రతిరోజూ ఎక్కువసేపు పగటి నిద్ర అలవాటుగా మారకుండా చూసుకోవాలి.నిద్రలేమిని నిర్లక్ష్యం చేయకండి:తరచుగా నిద్ర పట్టకపోవడం, రాత్రిలో పదేపదే మేల్కొనడం, ఉదయం లేచిన తర్వాత కూడా అలసటగా ఉండటం వంటి సమస్యలు కొనసాగితే కారణాన్ని తెలుసుకోవాలి. ముఖ్యంగా గట్టిగా గురక పెట్టడం, నిద్రలో ఊపిరి ఆగినట్లు అనిపించడం, పగటిపూట విపరీతమైన నిద్రమత్తు ఉంటే వైద్యుడిని సంప్రదించడం మంచిది.మంచి నిద్ర–మంచి ఆరోగ్యం:నిద్రను సమయం వృథా చేసే అలవాటుగా కాకుండా ఆరోగ్యానికి అవసరమైన పెట్టుబడిగా భావించాలి. రోజూ తగినంత నిద్ర, సమతుల్య ఆహారం, శారీరక వ్యాయామం, ప్రశాంతమైన మనసు–ఇవన్నీ కలిసినప్పుడే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమవుతుంది.రోజును చురుకుగా ప్రారంభించాలంటే రాత్రిని ప్రశాంతమైన నిద్రతో ముగించాలి.. డాక్టర్ డి.సి. తిరుపతిరావు సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ అన్నారు.

# ఆత్మకూరులో27వ ప్రపంచ దృష్టి దినోత్సవ కార్యక్రమము

**ఆత్మకూరు:** జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 27వ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారము కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాము కంటి వైద్యులు షేక్ షావలి మాట్లాడుతూ కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధవహించాలనికంటిసమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. విద్యార్థులు కంటి సంరక్షణకు సంబంధించిన జాగ్రత్తలను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి బాయి, వైస్ ప్రిన్సిపాల్ విద్యాసాగర్, టీబి సూపర్వైజర్ రవికుమార్తో పాటు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దసరా సెలవుల సందడి..

# 10వ తేదీ నుంచే పాఠశాలలకు విరామం!



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) విద్యా విభాగం పండుగ వేళ సొంతూళ్లకు పయనం.. పిల్లల్లో పండుగ ఉత్సాహం దసరా పండుగ నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రారంభం కానుండటంతో విద్యార్థుల్లో ఆనందం నెలకొంది. ఈ నెల 10వ తేదీ నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పండుగ ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు.

పుస్తకాలు, తరగతి గదుల సందడి నుంచి కొద్దిరోజుల విరామం లభించడంతో చిన్నారులు ఆటపాటలతో గడిపేందుకు సిద్ధమవుతున్నారు. దసరా పండుగ అంటేనే విజయానికి ప్రతీకగా నిలిచే పండుగ. కుటుంబ సభ్యుల కలయిక, బంధుమిత్రులతో సరదాలు, కొత్త బట్టలు, పిండి వంటలు, పండుగ సంబరాలతో ఇళ్లన్నీ సందడిగా మారనున్నాయి. పట్టణాలు, నగరాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతుండగా, తల్లిదండ్రులు కూడా పిల్లలతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

### పిల్లలతో సమయం గడపాలి..

రోజువారీ చదువులు, పరీక్షలు, హోంవర్క్లతో బిజీగా ఉండే విద్యార్థులకు సెలవులు కొంత ఉపశమనం కలిగిస్తాయి. ఈ సమయంలో పిల్లలు ఆటలు ఆడటంతో పాటు పుస్తక పఠనం, సృజనాత్మక కార్యక్రమాలు, కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా గడపడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ వారి అభిరుచులను ప్రోత్సహించాలి.

### ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరి..

దసరా సెలవుల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారు ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలి. రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున బస్సులు, రైళ్లలో ముందస్తు ప్రణాళికతో ప్రయాణించడం మంచిది. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. సెలవుల సమయంలో వినోదంతో పాటు ఆరోగ్యం, భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి.

### సెలవుల అనంతరం చదువులపై దృష్టి..

పండుగ సంబరాలతో పాటు విద్యార్థులు చదువులను పూర్తిగా పక్కన పెట్టకుండా, రోజులో కొంత సమయాన్ని పునశ్చరణకు కేటాయించాలి. సెలవులు ముగిసిన తర్వాత తిరిగి పాఠశాలలకు వెళ్లేందుకు అవసరమైన పుస్తకాలు, నోటుపుస్తకాలను సిద్ధం చేసుకోవాలి. మొత్తానికి, దసరా సెలవులు విద్యార్థులకు ఆనందాన్ని, కుటుంబాలకు ఆత్మీయతను పంచే సమయంగా నిలవనున్నాయి.

పండుగను సంతోషంగా జరుపుకుంటూనే భద్రత, ఆరోగ్యం, చదువుల విషయంలో తగిన శ్రద్ధ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు.

# బుచ్చిలో 'చైర్మన్' ఎవరు.?

- స్థానిక సంస్థల ఎన్నికల వేళ బుచ్చిరెడ్డిపాలెంపై జిల్లా దృష్టి
- వేమిరెడ్డి దంపతుల ఆశీస్సులు ఎవరికి.- సూరా శ్రీనివాసరెడ్డి పేరు చుట్టూ జోరుగా చర్చ
- కోవూరు రాజకీయాల్లో మారిన సమీకరణాలు.. - 'చైర్మన్' పీఠంపై ఎవరి పట్టు.?





నెల్లూరు(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల వేళ నెల్లూరు జిల్లా రాజకీయాల్లో బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ ప్రత్యేక కేంద్రంగా మారుతోంది. నగర పంచాయతీ చైర్మన్ పీఠం ఎవరిని వరించనుందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కోవూరు నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు.. వేమిరెడ్డి దంపతుల ప్రభావం.. స్థానికంగా బలమైన నేతల రాజకీయ భవిష్యత్తు.. ఇవన్నీ కలగలిసి బుచ్చి చైర్మన్ పదవిపై చర్చను మరింత ఆసక్తికరంగా మార్చాయి.కోవూరు రాజకీయాల్లో వేమిరెడ్డి దంపతులు తమదైన ముద్ర వేస్తున్నారన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ముఖ్యంగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వం, స్థానిక సమస్యలపై ఆమె స్పందించే తీరు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధానం, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి వంటి అంశాలు ఆమెకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని అనుచర వర్గాలు చెబుతున్నాయి. ఒక దశలో రాజకీయ అనుభవంపై ప్రశ్నలు వచ్చినప్పటికీ, క్రమంగా తనదైన శైలిలో రాజకీయంగా ఎదిగారన్న చర్చ కూడా ఉంది.

### కోవూరు రాజకీయాల్లో కొత్త సమీకరణాలు

కోవూరు నియోజకవర్గ రాజకీయాల్లో గత కొంతకాలంగా చోటుచేసుకున్న పరిణామాలు బుచ్చిరెడ్డిపాలెం రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ఒకవైపు అధికార పక్షానికి చెందిన నాయకత్వం.. మరోవైపు గతంలో నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నేతల వర్గాలు.. వీటి మధ్య స్థానికంగా రాజకీయ పోటీ కొనసాగుతోంది. ప్రతిపక్ష నాయకులు వేమిరెడ్డి కుటుంబంపై చేస్తున్న విమర్శలకు ప్రశాంతిరెడ్డి తనదైన శైలిలో సమాధానమిస్తున్నారని ఆమె అనుచరులు చెబుతున్నారు. అదే సమయంలో తనను నమ్ముకుని వచ్చిన వారికి రాజకీయంగా అండగా నిలవడం ఆమెకు ఉన్న ప్రత్యేక లక్షణమని అనుచర వర్గం పేర్కొంటోంది. అయితే ఈ అంశాలపై రాజకీయ ప్రత్యర్థులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందన్న ప్రశ్నకు ప్రాధాన్యం పెరిగింది.

### సూరా శ్రీనివాసరెడ్డి పేరు ఎందుకు తెరపైకి వచ్చింది?

బుచ్చిరెడ్డిపాలెం రాజకీయాల్లో సూరా శ్రీనివాసరెడ్డి పేరు కొత్తది కాదు. గతంలో మాజీ మంత్రి, కోవూరు రాజకీయాల్లో సుదీర్ఘకాలం కీలక పాత్ర పోషించిన నల్లపురెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి వర్గానికి ఆయన సన్నిహితుడిగా ఉన్నారని రాజకీయ వర్గాల్లో గుర్తింపు ఉంది. సుదీర్ఘకాలం ఒకే రాజకీయ శిబిరాన్ని నమ్ముకుని కొనసాగిన ఆయనకు అనేక రాజకీయ ఒడిదుడుకులు ఎదురయ్యాయని ఆయన అనుచరులు చెబుతున్నారు.గత ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో సూరా శ్రీనివాసరెడ్డి వేమిరెడ్డి దంపతులను ఆశ్రయించినట్లు ఆయన వర్గం చెబుతోంది. అనంతరం జరిగిన కొన్ని రాజకీయ పరిణామాలు ఇరువర్గాల మధ్య దూరాన్ని మరింత పెంచినట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది.ఆ సమయంలో సూరా శ్రీనివాసరెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ అరెస్టు వెనుక అధికార పార్టీ నాయకుల సూచనలు ఉన్నాయని ఆయన వర్గం ఆరోపించినప్పటికీ, ఈ ఆరోపణలను సంబంధిత వర్గాలు ఎలా చూస్తున్నాయన్నది వేరే అంశం. అయితే ఈ ఘటన తర్వాత బుచ్చి రాజకీయాల్లో సూరా శ్రీనివాసరెడ్డి పేరు మరింతగా వినిపించింది.

### 'ఒకరు పోతే పార్టీకి నష్టం లేదు' వ్యాఖ్యతో రగిలిన రాజకీయ వేడి

అరెస్టు ఘటన అనంతరం నల్లపురెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో చేసినట్లు ప్రచారంలో ఉన్న కొన్ని వ్యాఖ్యలు సూరా శ్రీనివాసరెడ్డి వర్గంలో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయని అప్పట్లో రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. ముఖ్యంగా "ఒకరు పోతే పార్టీకి నష్టం లేదు" అన్న భావనతో వచ్చిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయని స్థానిక నేతలు గుర్తుచేస్తున్నారు.

దీంతో సూరా శ్రీనివాసరెడ్డి కూడా మీడియా ముందుకు వచ్చి తన రాజకీయ బలాన్ని ప్రస్తావించినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. తన వెనుక గణనీయమైన ఓటు బ్యాంకు ఉందని, తనను తక్కువగా అంచనా వేయొద్దని బహిరంగంగా సవాల్ చేసినట్లు అప్పట్లో చర్చ జరిగింది.ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు బుచ్చి రాజకీయ సమీకరణాలను మార్చేశాయి.

### వేమిరెడ్డి శిబిరంలో చేరికతో మారిన లెక్కలు

వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సూరా శ్రీనివాసరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరడం స్థానిక రాజకీయాల్లో కీలక మలుపుగా మారిందని ఆయన అనుచరులు చెబుతున్నారు. గతంలో ప్రత్యర్థి రాజకీయ శిబిరంలో ఉన్న వ్యక్తి అధికార కూటమి వైపు రావడం.. అది కూడా వేమిరెడ్డి దంపతుల సమక్షంలో జరగడం.. బుచ్చిరెడ్డిపాలెం రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరతీసిందన్న అభిప్రాయం వ్యక్తమైంది.

అప్పటి నుంచి సూరా శ్రీనివాసరెడ్డి బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు నియోజకవర్గ పరిధిలో తన రాజకీయ కార్యకలాపాలను విస్తరించారని అనుచరులు చెబుతున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో సంబంధాలు కొనసాగించడం, వివిధ వర్గాలతో సంప్రదింపులు జరపడం ద్వారా తన రాజకీయ బలాన్ని పెంచుకున్నారని ఆయన వర్గం పేర్కొంటోంది.

ఇదే ఇప్పుడు చైర్మన్ పదవి చర్చకు ప్రధాన కారణంగా మారింది.

### 28 వార్డులపై ఎవరి పట్టు?

బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని వార్డుల రాజకీయ లెక్కలు ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఒక్క చైర్మన్ అభ్యర్థి వ్యక్తిగత బలం మాత్రమే కాకుండా.. ఆయనకు మద్దతుగా నిలిచే కౌన్సిలర్ల సంఖ్యే కీలకంగా మారనుంది.నగర పంచాయతీలోని ప్రతి వార్డులోనూ అభ్యర్థుల బలాబలాలు, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, వ్యక్తిగత పరిచయాలు, పార్టీ విధేయతలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది. దీంతో చైర్మన్ పీఠం కోసం ఇప్పటి నుంచే అంతర్గతంగా లెక్కలు మొదలయ్యాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి."వేమిరెడ్డి దంపతుల ఆశీస్సులు ఎవరికి ఉంటే వారికే చైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఎక్కువ" అనే అభిప్రాయం ఒకవైపు వినిపిస్తుండగా, "కౌన్సిలర్ల వ్యక్తిగత బలం, వార్డుల ఫలితాలే అసలు నిర్ణయాత్మకం" అనే వాదన మరోవైపు వినిపిస్తోంది.

### సూరా వైపే చూపులు ఎందుకు?

ప్రస్తుతం స్థానిక రాజకీయ చర్చల్లో సూరా శ్రీనివాసరెడ్డి పేరు ముందంజలో వినిపిస్తోంది. వేమిరెడ్డి దంపతులతో ఆయనకు ఉన్న రాజకీయ అనుబంధం.. గతంలో కోవూరు రాజకీయాల్లో ఆయనకు ఉన్న పరిచయాలు.. స్థానికంగా తనకంటూ ఉన్న అనుచర వర్గం.. ఇవన్నీ ఆయనకు అనుకూల అంశాలుగా ఆయన వర్గం ప్రచారం చేస్తోంది.బుచ్చిరెడ్డిపాలెం మాత్రమే కాకుండా బుచ్చి మండలంలోని పలు గ్రామాల్లోనూ తనకు రాజకీయ పరిచయాలు, అనుచర బలం ఉందని సూరా వర్గం చెబుతోంది. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఏ నాయకుడి బలం ఎంత అన్నది ఖచ్చితంగా చెప్పలేమని మరో వర్గం అంటోంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గుర్తు కంటే అభ్యర్థి వ్యక్తిగత పరిచయాలు, స్థానిక సమస్యలపై స్పందన, కుటుంబ సంబంధాలు, సామాజిక సమీకరణాలు, గత సేవలు వంటి అంశాలు కూడా కీలకంగా మారుతాయి. అందువల్ల చైర్మన్ ఎంపికలోనూ ఇవన్నీ ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### చివరి వరకు ఉత్కంఠే!

బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ చైర్మన్ పీఠం ఇప్పుడు ఒక సాధారణ స్థానిక పదవి కంటే ఎక్కువ ప్రాధాన్యం సంతరించుకుంది. కోవూరు నియోజకవర్గంలో రాజకీయ ఆధిపత్యానికి ఇది ఒక ప్రతీకగా మారనుందన్న చర్చ సాగుతోంది.వేమిరెడ్డి దంపతుల రాజకీయ ప్రభావం.. సూరా శ్రీనివాసరెడ్డి గత రాజకీయ ప్రయాణం.. నల్లపురెడ్డి వర్గంతో గతంలో ఉన్న అనుబంధం.. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు.. టీడీపీలో చేరిక.. స్థానికంగా ఏర్పడిన కొత్త సమీకరణాలు.. ఇవన్నీ కలిపి బుచ్చి చైర్మన్ ఎన్నికను ఆసక్తికరంగా మార్చాయి.

# శ్రీశైలక్షేత్రంలో 10 రోజుల పాటు దసరా సంబరాలు

### మీడియా మిత్రుల్ ప్రత్యక్ష్ ఇఓ శ్రీనివాస్ చైర్మన్ రమేష్ నాయుడు



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) జ్యోతిర్లింగ, శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైలంలో అక్టోబర్ 11 నుండి 20 వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు స్వామివారికి విశేష పూజలు, అమ్మవారికి నవావరణ పూజలు, చండీ, రుద్రయాగాలు, ప్రత్యేక అలంకారాలు, వాహన సేవలు నిర్వహించనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈఓ ఎం.శ్రీనివాసరావు ఆదేశాలతో క్యూలైన్ల క్రమబద్ధీకరణ, తాగునీరు, మజ్జిగ పంపిణీ, పారిశుద్ధ్యానికి ప్రత్యేక సిబ్బందిని నియమించారు. చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు సూచనలతో అదనపు సీసీ కెమెరాలు, లడ్డూ కౌంటర్లు, అన్నదానం విస్తరణ, వైద్య శిబిరాలు, వాట్సాప్ దర్శన టోకెన్లు ఏర్పాటు చేశారు. 11న భృంగి, 12న మయూర, 13న రావణ, 14న కైలాస, 15న శేష, 16న హంసవాహనం, పుష్పపల్లకీ, 17న గజ, 18న నంది, 19న కైలాస, 20న నందివాహనంతో పాటు తెప్పోత్సవం నిర్వహిస్తారు.

## అన్ని కులాల్లోని నిరుపేదలకూ రిజర్వేషన్లు దక్కాలి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అన్ని వర్గాల్లోని అట్టడుగు నిరుపేదలకు ప్రభుత్వ ఫలాలు, రిజర్వేషన్లు అందడం లేదని, కులమతాలకు అతీతంగా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయడమే ప్రధాన ధ్యేయంగా పోరాడుతున్నామని 'ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన కమిటీ' నాయకులు స్పష్టం చేశారు. గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో రాష్ట్ర స్థాయి కమిటీ ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నేతలు మాట్లాడారు.

### 24న తెలంగాణలోకి ఆర్థిక రిజర్వేషన్ సాధన రథయాత్ర

ప్రవీణ్ అరోరా నేతృత్వంలో ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ప్రారంభమైన 20,000 కిలోమీటర్ల సుదీర్ఘ 'రథయాత్ర' ఈ నెల 24న నాగ్‌పూర్ మీదుగా ఆదిలాబాద్ వద్ద తెలంగాణలోకి ప్రవేశించనుందని రాష్ట్ర కో ఆర్డినేటర్ అప్పమ్మగారి రాం రెడ్డి తెలిపారు. 24న నిర్మల్‌లో కార్నర్ మీటింగ్, ఆర్మూర్‌లో బహిరంగ సభ, 25న నిజామాబాద్, కామారెడ్డి, రామాయణపేట, తూప్రాన్ లలో సమావేశాలు నిర్వహించి హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. 26న హైదరాబాద్ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం, జనగామ, వరంగల్ మీదుగా పరకాల చేరుకొని సుమారు 15,000 మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

### ప్రత్యేక రాజ్యాంగ కమిషన్ ఏర్పాటు చేయాలి

మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి మాదిగ, మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం వెంటనే ఒక ప్రత్యేక రాజ్యాంగ కమిషన్‌ను ఏర్పాటు చేసి చట్టబద్ధంగా ఆర్థిక ఆధారిత రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆశయాలకు అనుగుణంగా, అట్టడుగున ఉన్న ప్రతీ పేదవానికి సంక్షేమ ఫలాలు అందే వరకు ఈ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ రథయాత్రకు మరియు ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల ఉద్యమానికి ప్రజలు, అన్ని వర్గాల నాయకులు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో పైళ్ల హరినాథ్ రెడ్డి ఏనుగు సంతోష్ రెడ్డి,నల్లవెల్లి కర్ణాకర్ రెడ్డి,బుట్టం గారి మాధవ రెడ్డి,గోపు జైపాల్ రెడ్డి,దుబ్బ శ్రీనివాస్,పశుపతి,బెలిదే రమేష్ గుప్తా,పొలటి రామారావు,తుమ్మల మధుకర్ రెడ్డి,చినుకుల నర్సిహ్మ రెడ్డి,కంకణాల రామచంద్ర రెడ్డి,బోకూరి మోహన్ రెడ్డి,పుప్పలకృష్ణకుమార్ నాయుడు,శ్యామల శర్మ,నీరుడు దయాకర్ రెడ్డి,కొత్త జైపాల్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి గొట్టుముక్కల, గోపాల్ రెడ్డి పాటు రాష్ట్ర పలు కుల సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# 'యోగ సైన్స్ ఫర్ వెల్నెస్' కోర్సు పూర్తి

### ఆయుష్ ఎండీఎన్ఐవై డైరెక్టర్ డా. కాశీనాథ్ సమాగండి చేతుల మీదుగా సర్టిఫికెట్ స్వీకరణ






న్యూ ఢిల్లీ(ప్రశ్న న్యూస్) యోగ థెరపీ,మర్మ థెరపీ, హోలిస్టిక్ వెల్నెస్, ఆరోగ్య పరిరక్షణ రంగంలో విశేష సేవలందిస్తున్న ఏ. సంజయ్ రెడ్డి 'యోగ సైన్స్ ఫర్ వెల్నెస్' కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా కోర్సు పూర్తి చేసినందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ పరిధిలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా డైరెక్టర్ డా. కాశీనాథ్ సమాగండి చేతుల మీదుగా ఆయన స్వీకరించారు.
యోగ శాస్త్రంలోని సూత్రాలను ఆధునిక ఆరోగ్య అవసరాలతో అనుసంధానం చేస్తూ వెల్నెస్‌ను ప్రోత్సహించే అంశాలపై ఈ కోర్సు ద్వారా అవగాహన పొందినట్లు ఏ. సంజయ్ రెడ్డి తెలిపారు. యోగ, ప్రాణాయామం, ఆరోగ్యకరమైన జీవన విధానం, శారీరక-మానసిక సమతుల్యత వంటి అంశాలను ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ శిక్షణ తనకు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం యోగ థెరపీ,మర్మ థెరపీ, హోలిస్టిక్ వెల్నెస్ రంగాల్లో పనిచేస్తున్న ఏ. సంజయ్ రెడ్డి, శాస్త్రీయ యోగ విజ్ఞానాన్ని ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఉపయోగించేందుకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# సౌత్ ఇండియా షాపింగ్ మాల్ లో దసరా,దీపావళి సరసమైన ధరలతో షాపింగ్

## -సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యం



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) బాచుపల్లి సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్ శుభారంభం 2026 అక్టోబర్ 8వ తేదీన బాచుపల్లి, మియాపూర్ రోడ్డులోని అమీన్‌పూర్‌లో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ తమ 40వ స్టోర్ కు శుభారంభం చేసింది. ఈ నూతన స్టోర్‌లో దసరా, దీపావళి ప్రత్యేక కలెక్షన్స్‌లో భాగంగా కుటుంబంలో అన్ని తరాల వారి అభిరుచులను ప్రతిబింబించే సంప్రదాయ చీరెలు, పండగ అలంకరణ దుస్తులు, సరికొత్త డిజైన్స్ వంటి వైవిధ్యభరిత ఉత్పత్తులను సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ నిర్వాహకులు ఒకేచోట విక్రయానికి అందుబాటులో ఉంచడం విశేషం. ప్రముఖ నటీమణి కుమారి వైష్ణవి చైతన్యలి జ్యోతిని వెలిగించి,రిబ్బన్ కత్తిరించడం ద్వారా ఈ సరికొత్త స్టోర్ శుభారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున షాపింగ్‌ప్రియులు విచ్చేసి, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుమారి వైష్ణవి చైతన్యమాట్లాడుతూ. బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ తన చేతులమీదుగా శుభారంభం చేసుకోవడం ఆనందకర విషయం అన్నారు. ముఖ్యంగా దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా కుటుంబసభ్యుల అభిరుచులను ప్రతిబింబించే వైవిధ్యభరిత వస్త్రాలు ఈ సరికొత్త స్టోర్‌లో అందుబాటులో ఉండటం విశేషమని ఆమె అన్నారు. ఈ సరికొత్త స్టోర్స్ శుభారంభం సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యాజమాన్యం విశ్వనగరంగా విస్తరిస్తున్న



హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్రాంత షాపింగ్‌ప్రియులకు హృదయపూర్వక స్వాగతం పలికి, కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.పొట్టి వెంకటేశ్వర్లు, ఛైర్‌పర్సన్ & హోల్-టైం డైరెక్టర్"విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్రాంతంలో 40వ స్టోర్‌ను ప్రారంభించడం మాకు ఎంతో ఆనందంగా,మరెంతో గర్వకారణంగా ఉంది.ఈ ప్రాంతంలో షాపింగ్‌ప్రియుల కుటుంబాల సమాఖ్య పెద్ద ఎత్తున ఉండటం,వారి పర్వదిన అవసరాలకు, వివాహ వేడుకలకు సరితూగే వస్త్రాలను మేము అందజేయడం సంతోషదాయకం"అన్నారు. శీర్ణ రాజమౌళి, మేనేజింగ్ డైరెక్టర్"దసరా, దీపావళి పర్వదినాలకు, వివాహ వేడుకలకు, కుటుంబసభ్యుల అందరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వారి అభిరుచులకు అనువైన వస్త్ర ఉత్పత్తులను హాయిగొలిపేలా,అత్యంత సౌకర్యంతో అందజేయడమే మా లక్ష్యం"అన్నారు.శ్రీ తిరువీధుల ప్రసాదరావు, హోల్-టైం డైరెక్టర్ "మీకు సంప్రదాయాన్ని ప్రతిబింబించే పట్టుచీరెలు కావాలన్నా,



పండగ చీరెలు కావాలన్నా, క్యాజువల్ వేర్ కావాలన్నా, కుటుంబంలోని అన్నితరాల వారినీ మెప్పించే వెరైటీలు మా సరికొత్త స్టోర్‌లో ఉన్నాయి"అన్నారు. పవిత్ర దసరా, దీపావళి పర్వదినాలు, అదేవిధంగా వివాహాది శుభకార్యాల సందర్భంగా పూర్తి కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బాచుపల్లిలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్ అందిస్తున్న ప్రత్యేక కలెక్షన్లు మహిళల కోసం అందమైన కంచి పట్టుచీరెలు, ఫ్యాన్సీ చీరెలు, భారతదేశ వ్యాప్తంగా మాస్టర్ వీవర్స్ రూపొందిస్తున్న కళాత్మక సమర్పణలు, పెళ్లికుమార్తెకు వన్నె తెచ్చే వైవిధ్యభరిత సంప్రదాయ వస్త్రాలు పురుషుల కోసం అద్భుతమైన డిజైనర్ కుర్తాలు, సాంప్రదాయిక ఎత్నిక్ వస్త్రాలు, ఫార్మల్ సూట్స్, అధునాతన క్యాజువల్ స్టైల్స్ చిన్నారుల కోసం ఆకర్షణీయమైన అందాల రంగుల్లో ఆకట్టుకునే ట్రెండీ ఫెస్టివల్ సూట్స్ సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ వారు బాచుపల్లిలోని మియాపూర్ రోడ్డు, అమీన్‌పూర్ లో సరికొత్తగా ప్రారంభించిన 40వ స్టోర్‌కు విచ్చేసి. దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని పొందవలసిందిగా, ప్రారంభోత్సవ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవలసిందిగా. బాచుపల్లి, మియాపూర్, అమీన్‌పూర్ పరిసర ప్రాంతాలకు చెందిన షాపింగ్‌ప్రియులకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు.

## మునిరాబాద్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని మునీరాబాద్ లో పౌర సరఫరాల శాఖ అధికారి లక్ష్మీకాంత్ , స్థానిక రేషన్ డీలర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమక్షంలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 299 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్, జిల్లా ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్, మునిరాబాద్ మాజీ ఉపసర్పంచ్ సుక్క బిక్షపతి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరాం రెడ్డి , తలారి వెంకటేష్ ముదిరాజ్, కర్రోల్ల సంతోష్ కుమార్ , కర్రోళ్ల ప్రవీణ్ కుమార్ ,నాగరాజు రెడ్డి , రామకృష్ణారెడ్డి , గుండ్ల పోచంపల్లి డివిజన్ మైనార్టీ అధ్యక్షులు షేక్ మహబూబ్, రామారం రాజశేఖర్, నక్క నగేష్ గౌడ్, ఎండి జాంగిర్ , రామారం నర్సింగరావు ,యూత్ కాంగ్రెస్ నాయకులు తేలు నరేష్ ముదిరాజ్ గారు, లతో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో ప్రజా పాలన అద్భుతంగా కొనసాగుతుందని . గత ప్రభుత్వంలో రేషన్ కార్డుల కోసం ఏళ్లుగా ఎదురుచూసిన పేదలకు, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి వద్దకే వచ్చి కార్డులు అందిస్తుందన్నా రు మునీరాబాద్ లో అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులు ఇప్పిస్తాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని గౌరవించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారుగురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి ఆర్టిఐ వారోత్సవాలు 2026 అవగాహన సదస్సులో భాగంగా సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలని స్వచ్ఛందంగా సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉంచాలని పనితీరులో పారదర్శకత జవాబుదారీతనాన్ని పాటించాలని జిల్లా అధికారులకు సూచించారు.అనంతరం జిల్లా అధికారులు సిబ్బందితో సమాచార హక్కు చట్టం 2025 పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ వో మాలతి వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జెండా ఏదైనా.. ఎజెండా మాత్రం ప్రజల సంక్షేమమే కావాలి..

### ఎంపీ ఈటల రాజేందర్




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )అలియాబాద్ మున్సిపాలిటీ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంపై సభ్యులతో చర్చించారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవరెడ్డి , గౌరవ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటరెడ్డి పాల్గొన్నారు.సమావేశంలో రాబోయే బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు, మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలు పాత ఆరు గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వీధి దీపాలు, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించి అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులందరూ పార్టీలకు అతీతంగా ఐక్యంగా పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డు, ప్రతి ఇల్లు, ప్రతి పౌరుడు ముఖ్యమని, ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతమైన పౌర సేవలు అందించడమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని అన్నారు.జెండా ఏదైనా.. ఎజెండా మాత్రం ప్రజల సంక్షేమమే కావాలి" అనే భావనతో ప్రతి ఒక్కరూ ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, త్రాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఐక్యంగా పనిచేయడం ద్వారా మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని, గతంలో తెలంగాణ ఉద్యమ కాలంలో తనకు ఎదురైన అనుభవాలను కూడా సభ్యులతో పంచుకున్నారు.అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైనప్పుడు తనను సంప్రదించవచ్చని ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ గారు సభ్యులకు భరోసా ఇచ్చారు.ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, సమన్వయంతో పనిచేసి అలియాబాద్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు.

# నానా పటేకర్ మృతి వార్త బాధాకరం

### ఆయన నటన మరచిపోలేనిది: పవన్‌కల్యాణ్



అమరావతి(ప్రశ్న న్యూస్) ప్రముఖ నటుడు నానా పటేకర్ ఆకస్మిక మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. నానా పటేకర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎటువంటి పాత్రలోనైనా పూర్తిగా ఒదిగిపోయే ప్రతిభావంతుడైన నటుడు నానా పటేకర్ అని పవన్‌కల్యాణ్ కొనియాడారు. ముఖ్యంగా 'క్రాంతివీర్' చిత్రంలో ఆయన నటన మరచిపోలేనిదని పేర్కొన్నారు. నటుడిగా నానా పటేకర్ తనదైన ముద్ర వేశారని తెలిపారు.పరిందా, ఖామోషీ, తిరంగా, అగ్నిసాక్షి, నటసామ్రాట్, అబ్ తక్ ఛప్పన్, అపహరణ్ తదితర చిత్రాలు ఆయన సుదీర్ఘ నట ప్రస్థానంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని పవన్‌కల్యాణ్ గుర్తుచేశారు. విభిన్న పాత్రలను తన సహజ నటనతో పండించడం ద్వారా ప్రేక్షకుల హృదయాల్లో నానా పటేకర్ చెరగని స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు.సినీ రంగంతో పాటు భారత సైన్యంలోనూ నానా పటేకర్ గౌరవపూర్వకంగా సేవలందించారని పవన్‌కల్యాణ్ తెలిపారు. దేశ సేవ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా గుర్తుచేశారు.నానా పటేకర్ మృతి సినీ రంగానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని పవన్‌కల్యాణ్ తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# 'రణబాలి'గా

## విజయ్ దేవరకొండ గర్జన..




విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' ట్రైలర్ గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్, విడుదలైన కొద్ది క్షణాల్లోనే సోషల్ మీడియాలో ప్రభంజనం సృష్టిస్తోంది. భారీ యాక్షన్ ఘట్టాలు, భావోద్వేగ సన్నివేశాలతో కూడిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఈ చిత్రం 1854–1878 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందింది. బ్రిటిష్ పాలకుల దమననీతికి వ్యతిరేకంగా పోరాడిన ఒక వీరుడి గాథే 'రణబాలి'. ఇందులో 'శింగనమల బొబ్బిలి రణబాలి' అనే శక్తిమంతమైన పాత్రలో విజయ్ దేవరకొండ నటిస్తుండగా, ఆయన భార్య 'జయమ్మ'గా రష్మిక మందన్న కనిపించనుంది. బ్రిటిష్ అధికారి పాత్రలో హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ నటించడం సినిమా స్థాయిని తెలియజేస్తోంది. 3 నిమిషాల 47 సెకన్ల నిడివి ఉన్న ఈ ట్రైలర్‌లో విజయ్ దేవరకొండ తన విశ్వరూపాన్ని చూపించారు. పోరాట సన్నివేశాల్లో ఆయన నటన, సంభాషణలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత విజయ్–రష్మిక జంటగా నటిస్తున్న ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. నిజ జీవితంలో భార్యాభర్తలుగా మారిన తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో అభిమానుల్లో అమితాసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్, టీ–సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయ్–అతుల్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని విజయదశమి కానుకగా అక్టోబర్ 16న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ చిత్రంపై ట్రేడ్ వర్గాల్లో సైతం భారీ అంచనాలు ఉన్నాయి.

# థియేటర్లలో సెన్సేషన్.. ఇప్పుడు ఓటీటీలోకి 'మండాడి',ఎక్కడ స్ట్రీమింగ్ అంటే?




ఈ ఏడాది కోలీవుడ్‌లో ప్రేక్షకులను మెప్పించడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న సినిమాల్లో 'మండాడి' ఒకటిగా నిలిచింది. టాలెంటెడ్ నటుడు సూరి హీరోగా నటించిన ఈ చిత్రంలో టాలీవుడ్ యువ నటుడు సుహాస్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. సముద్రపు నేపథ్యంతో తెరకెక్కిన ఈ రేసింగ్ డ్రామా ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసింది. దర్శకుడు మథిమారన్ పుగళేంది తెరకెక్కించిన ఈ ఇంటెన్స్ యాక్షన్ డ్రామా.. సూరి కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచింది. ఇప్పటివరకు కామెడీ, సహాయ నటుడి పాత్రలతో ఎక్కువగా గుర్తింపు తెచ్చుకున్న సూరి.. హీరోగా తనలోని మరో కోణాన్ని ఈ సినిమాతో ప్రేక్షకులకు చూపించారు. ఆయన నటనకు మంచి ప్రశంసలు దక్కడంతో పాటు సినిమా బాక్సాఫీస్ వద్ద కూడా భారీ వసూళ్లను సాధించింది. 'మండాడి' విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంది. ముఖ్యంగా సముద్రం నేపథ్యంలో సాగే కథ, రేసింగ్ అంశాలు, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కథలోని ఉత్కంఠభరితమైన అంశాలను దర్శకుడు మథిమారన్ పుగళేంది ఆసక్తికరంగా తెరకెక్కించడంతో థియేటర్లలో ప్రేక్షకులు సినిమాను బాగా ఆదరించారు. సూరి హీరోగా తన ఇమేజ్‌కు భిన్నమైన పాత్రలో కనిపించడం సినిమాకు మరో ప్రత్యేకతగా మారింది. మరోవైపు సుహాస్ విలన్ పాత్రలో కనిపించడం తెలుగు ప్రేక్షకుల్లోనూ ఆసక్తిని పెంచింది. ఇప్పటివరకు విభిన్నమైన కథలు, సహజమైన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న సుహాస్.. 'మండాడి'లో ప్రతినాయకుడిగా కనిపించి మెప్పించారు. థియేటర్లలో మంచి ఆదరణ కొనసాగుతున్న నేపథ్యంలో సినిమాను ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ నెల 9 నుంచి ఐమ్యాక్స్ స్క్రీన్లలో సినిమాను ప్రదర్శించనున్నట్లు సమాచారం. దీంతో థియేటర్లలో ఇప్పటికే సినిమా చూసిన అభిమానులు సైతం ఐమ్యాక్స్ అనుభూతి కోసం మరోసారి సినిమాను చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక థియేటర్లలో మంచి రన్ కొనసాగుతున్న సమయంలోనే 'మండాడి' డిజిటల్ ప్రీమియర్‌కు కూడా సిద్ధమైంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ వేదిక నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. తాజాగా సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే చూడొచ్చు. ముఖ్యంగా సూరి నటనతో పాటు సుహాస్ ప్రతినాయక పాత్రను చూడాలనుకునే తెలుగు ప్రేక్షకులకు కూడా ఓటీటీ విడుదల మంచి అవకాశంగా మారింది.

# అందరూ తీర్పులిచ్చేవారే!



రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనలో కథానాయిక కృతిసనన్ ధరించిన దుస్తులపై సోషల్‌మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. సంప్రదాయ వేడుకలో అలాంటి దుస్తులు ధరించడమేంటని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా ఈ వివాదంపై కృతిసనన్ మరోమారు స్పందించింది. కరీనా కపూర్ నిర్వహిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' సీజన్ 6లో పాల్గొన్న ఆమె ఈ వివాదంపై మాట్లాడింది. 'నేను ధరించిన డ్రెస్ ఇంత వివాదం సృష్టిస్తుందని అనుకోలేదు. ఏకంగా ఆరుగురు కూర్చుని చేసే ప్రైమ్‌టైమ్ న్యూస్ ప్యానెల్ డిబేట్‌గా మారింది. ఇతరుల్ని జడ్జ్ చేస్తూ తీర్పులు ఇవ్వడం చాలా సులభం. ఇక్కడ అందరూ తీర్పులిచ్చేవారే. ఎవరి పని వారు చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు' అంటూ కృతిసనన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. రక్షాబంధన్ ప్రకటనలో కృతిసనన్ ఇండో–వెస్ట్రన్ దుస్తుల్లో కనిపించింది. తన సోదరుడితో పాటు శు నకానికి రాఖీ కట్టినట్లుగా ఆ ప్రకటనలో చూపించారు. ఈ వివాదం నేపథ్యంలో చివరకు మేకర్స్ ఆ యాడ్‌ను తొలగించారు.

# స్వీట్‌లవ్‌స్టోరీ..

## 'బ్లడీ రోమియో' తర్వాత ప్రేమకథనే!



ప్రతీ సినిమాలో నటుడిగా తనని తాను కొత్తగా ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తుంటారు హీరో నాని. ఇటీవల 'ది ప్యారడైజ్' చిత్రంలో మాస్ అవతారంలో ఆయన ప్రేక్షకుల్ని మెప్పించారు. ప్రస్తుతం ఆయన గ్యాంగ్‌స్టర్ రొమాంటిక్ డ్రామా 'బ్లడీ రోమియో' పనుల్లో బిజీగా ఉన్నారు. ఇది పూర్తయిన తర్వాత తాను పూరిస్థాయి ప్రేమకథా చిత్రంలో నటించబోతున్నట్లు నాని తెలిపారు. 'ఈ సినిమా స్వీట్‌లవ్‌స్టోరీగా ఉంటుంది. పిల్లలు కూడా చూసి ఎంజాయ్ చేసేలా చక్కటి వినోదం, సున్నితమైన అంశాలతో రూపొందించబోతున్నాం' అని నాని తెలిపారు. అయితే ఈ సినిమాకు దర్శకుడెవరనే విషయాన్ని నాని వెల్లడించలేదు. ఆయన నటించిన పీరియాడిక్ చిత్రం 'ది ప్యారడైజ్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం 170కోట్ల వరకు వసూళ్లను రాబట్టింది.

# మిస్టరీ థ్రిల్లర్ 'మయూఖ'



మిస్టరీ థ్రిల్లర్ కథాంశంతో రూపొందించిన 'మయూఖ' చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకురానుంది. పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి శ్రీతేజ ఎస్.కె దర్శకుడు. శశిధర్ నల్ల నిర్మించారు. బుధవారం దర్శకుడు శ్రీతేజ విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ సినిమాకు ఇటీవల జరిగిన న్యూయార్క్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ మిస్టరీ ఫిల్మ్ అవార్డ్ వచ్చిందని తెలిపారు. 'కథానాయిక ఉండే ఫ్లాట్‌లోకి ఒక అపరిచిత వ్యక్తి ఎందుకు వచ్చాడు? అతను ఏం చేశాడు? హీరోయిన్‌తో అతనికి ఉన్న సంబంధం ఏమిటి? అనే అంశాలు ఈ కథలో ఉత్కంఠను కలిగిస్తాయి. ప్రేక్షకులకు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతూనే గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించే చిత్రమిది' అన్నారు. తాను 20ఏళ్ల క్రితం షార్ట్ ఫిల్మ్స్ రూపొందించానని, ఆ తర్వాత అమెరికా వెళ్లానని, అక్కడ న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో డైరెక్షన్ కోర్స్ చేశానని శ్రీతేజ తెలిపారు.

# మోసం చేసేది ఎవరో?



ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన రియాలిటీ షో 'ది ట్రెయిటర్స్' తెలుగులో రాబోతున్నది. ఈ షోకు యువ హీరో తేజ సజ్జ ప్రయోక్తగా వ్యహరించనున్నారు. మొత్తం పది ఎపిసోడ్స్‌గా రూపొందిన ఈ సిరీస్ ఈ నెల 15 నుంచి ప్రతి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కొత్త ఎపిసోడ్‌తో ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం హీరో తేజ సజ్జ విలేకరులతో మట్లాడారు. 'మిరాయ్' సినిమా తర్వాత ప్రైమ్ వీడియో తనను సంప్రదించగా ఫార్మాట్‌పై నమ్మకంతో వెంటనే అంగీకరించానన్నారు. 'ఈ షో మర్డరీ మిస్టరీ థ్రిల్లర్‌ను చూస్తున్న అనుభూతిని కలిగిస్తుంది. ఇప్పటివరకు వచ్చిన తెలుగు రియాలిటీ షోలకు భిన్నంగా ఉంటుంది. ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఎవరు ట్రెయిటర్స్? ఎవరు అమాయకులు? అనే ఉత్కంఠతో సాగుతుంది. ఇందులో 20 మంది సెలబ్రిటీలు పాల్గొంటారు. వారి ఎంపికలో ఆడే సామర్థ్యం, నమ్మించడం, వ్యూహాలు పన్నడం వంటి లక్షణాలకు ప్రాధాన్యం ఇచ్చాం. 11 రోజుల్లో 10 ఎపిసోడ్ల షూటింగ్ పూర్తయింది, పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఎంజాయ్ చేసే షో ఇది' అన్నారు. తన తదుపరి చిత్రం 'జాంబిరెడ్డి–2' షూటింగ్ ఇటీవలే ప్రారంభమైందని, మంచి క్రేజీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని తేజ సజ్జ తెలిపారు.

# ఇది భారత ప్రజల సినిమా



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత కథ ఆధారంగా రూపొందించిన 'హనుమాన్ అంశ్' చిత్రం దేశీయ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతున్నది. శోభినవ్ సత్య ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించారు.

ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ దక్షిణాది భాషల్లో విడుదల చేస్తున్నది. తెలుగులో ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శోభినవ్ సత్య మాట్లాడుతూ.. హనుమంతుడి ఆశీస్సులతో ఈ సినిమా ఈ స్థాయిలో విజయం సాధించిందని, ఇది భారతీయ ప్రజల చిత్రమని అన్నారు. రెండు కోట్లు ఖర్చు పెట్టి తీసిన సినిమా 400కోట్లు వసూలు చేయడం మామూలు విషయం కాదని, తెలుగులో కూడా పెద్ద విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉందని మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్ పేర్కొన్నారు. మనందరం హనుమంతుడి భక్తులమేనని, థియేటర్లలో ఈ సినిమాను ఆస్వాదించాలని దర్శకుడు విశాల్ చతుర్వేది కోరారు.

# ప్రభుత్వ పాఠశాల స్థలంలో విగ్రహం ఏర్పాటుపై ఫిర్యాదు

**- అనుమతులు, భూమి వినియోగంపై విచారణ చేపట్టాలని అధికారులకు రవి యాదవ్ వినతి**



శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) సురభి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన స్థలంలో విగ్రహం ఏర్పాటు చేస్తున్న అంశంపై విచారణ చేపట్టాలని కోరుతూ రవి యాదవ్ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లను కలిసి ఫిర్యాదు లేఖలు సమర్పించారు.ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంలో విగ్రహం ఏర్పాటుకు ఏ శాఖ అనుమతి ఇచ్చింది? స్థల వినియోగానికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారిక అనుమతులు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించాలని ఆయన కోరారు.శేరిలింగంపల్లి--పాపిరెడ్డి కాలనీ ప్రాంతంలో గతంలో పలువురు ప్రజా జీవితంలో సేవలందించినప్పటికీ, ప్రభుత్వ పాఠశాల స్థలంలో వ్యక్తిగత విగ్రహం ఏర్పాటు చేసిన సందర్భం లేదని రవి యాదవ్ పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ తన భార్య విగ్రహాన్ని ప్రభుత్వ పాఠశాల స్థలంలో ఏర్పాటు చేయడానికి ఏ ప్రాతిపదిక ఉందో అధికారులు స్పష్టం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల స్థలం విద్యార్థుల విద్యా అవసరాలు, ప్రజా ప్రయోజనాల కోసం ఉద్దేశించినదని పేర్కొంటూ, అధికారులు తక్షణమే స్థల పరిశీలన నిర్వహించి భూమి రికార్డులు, అనుమతులు, స్థల వినియోగ నిబంధనలను పరిశీలించాలని రవి యాదవ్ విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విగ్రహం ఏర్పాటు జరుగుతున్నట్లు తేలితే చర్యలు తీసుకుని ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాలను ప్రజా ప్రయోజనాలకే వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు యోగా శిక్షణ



తుక్కుగూడ (ప్రశ్న న్యూస్) తుక్కుగూడ ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో వార్డెన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా, ధ్యానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు అల్లే సత్తయ్య 35 మంది విద్యార్థులకు ధ్యానం, ప్రాణాయామం, సూక్ష్మ వ్యాయామాలు, వివిధ ఆసనాలు, సూర్య నమస్కారాలు, యోగ క్రియలపై శిక్షణ అందించారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం సాధన చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.
సంప్రదించవలసిన నంబర్: 94909 95238

# జిల్లాలోని పీఎం శ్రీ సెకండరీ పాఠశాలలో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ల నియామకాలు




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 22 పి.ఎం.శ్రీ (పీఎం శ్రీ ) సెకండరీ పాఠశాలల్లో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ల (గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్) నియామకాలు చేపట్టనున్నారు.సమగ్ర శిక్ష, తెలంగాణ ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 22 పి.ఎం.శ్రీ (పీఎం శ్రీ ) సెకండరీ పాఠశాలల్లో ప్రతి పాఠశాలకు ఒకరి చొప్పున గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్లను పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన అయిదు నెలల పాటు, నవంబర్ 2026 నుండి మార్చి 2027 వరకు నియమించడం జరుగుతుంది. పాఠశాలల్లో నియమించబడిన భావితా కేంద్రాల (భవిత సెంటర్స్ ) ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ( సి డబ్ల్యూ ఎస్ ఎన్ ) ప్రత్యేక విద్యాపరమైన మద్దతును అందించడానికి మరియు సమ్మిళిత విద్యను (ఇంక్లూసివే ఎడ్యుకేషన్ ) బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం ఉద్దేశం.ఈ పాఠశాలలు మేడ్చల్, దుండిగల్ గండిమైసమ్మ, బాచుపల్లి, ఉప్పల్, మేడ్చల్, కప్రా, షామీర్పేట్, కీసర, ఘట్కేసర్ మూడుచింతలపల్లి మండలాలలో ఉన్నాయి.

**దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు** స్పెషల్ ఎడ్యుకేటర్ల కోసం నిర్దేశించిన అర్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులు. బి.ఎడ్. (స్పెషల్ ఎడ్యుకేషన్), డిప్లొమా / పి.జి.పి.డి. / పి.జి.పి.సి. ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్తో కూడిన బి.ఎడ్. (జనరల్), స్పెషల్ ఎడ్యుకేషన్లో పి.జి. డిప్లొమా, ఎస్.ఎల్.టి.సి. ఇన్ విజువల్ ఇంపెయిర్మెంట్, సీనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ ది డెఫ్ లేదా బి.ఎడ్. ఇన్ విజువల్ ఇంపెయిర్మెంట్ కలిగి ఉండాలి. మెరిట్ ఆధారంగా, స్థానిక గ్రామం, మండలం మరియు జిల్లా క్రమంలో అర్హులైన స్థానిక అభ్యర్థులకు తగిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఎంపికైన అభ్యర్థులు తమకు కేటాయించిన పాఠశాలలో భావితా కేంద్రంలో సేవ చేయడానికి సుముఖత కలిగి ఉండాలి.

**గౌరవ వేతనం** ప్రతి గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్కు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించబడుతుంది. మండల విద్యాశాఖాధికారి చేత ధ్రువీకరించబడిన హాజరు సర్టిఫికెట్ ఆధారంగా ఇది విడుదల చేయబడుతుంది.

**విధులు** ఈ ఎడ్యుకేటర్లు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి అంచనా వేస్తారు, వ్యక్తిగతీకరించిన మద్దతును అందిస్తారు. వ్యక్తిగత విద్యా ప్రణాళికలను రూపొందిస్తారు. నమోదు నిలకడకు మద్దతు ఇస్తారు, పాఠశాల గృహ సందర్శనలు చేస్తారు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇస్తారు, అలాగే భావితా కేంద్రాలు సమ్మిళిత విద్యా వనరుల వ్యక్తులతో సమన్వయం చేసుకుంటారు.

**దరఖాస్తు విధానం** అర్హత ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యా అర్హత ధ్రువపత్రాల కాపీలు ఇతర సపోర్టింగ్ డాక్యుమెంట్లతో కూడిన దరఖాస్తులను సంబంధిత పి.ఎం.శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయునికి ఈనెల 13 అంతకంటే ముందుగా సమర్పించాలి. పాఠశాలల వివరాలు జతచేయబడ్డాయి అందుబాటులో ఉన్నాయి.ఈ నియామకం పూర్తిగా తాత్కాలికమైనది, స్వల్పకాలికమైనది. నిర్ణీత గడువు ముగిసిన వెంటనే ఇది స్వయంచాలకంగా ముగిసిపోతుంది. భవిష్యత్తులో ఎలాంటి నియామకానికైనా ఎటువంటి హక్కు లేదా క్లెయిమ్ కోరే అవకాశం లేదు.

# నకిలీ జీపీఏలతో స్థలాల విక్రయం

**- కీసరలో ఐదుగురు అరెస్ట్**




**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )**దమేడ్చల్ జిల్లా కీసర మండలం చీర్యాల గ్రామంలో నకిలీ జీ పీ ఏ లతో రూ.కోట్ల విలువైన భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్న ముఠా గుట్టును కీసర పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణి తెలిపారు. కీసర పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.విద్యానగర్కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి తోటరెడ్డి వెంకట్ రెడ్డి (78) చీర్యాలలో సర్వే నెం.94లో 18 ఎకరాల 19 గుంటల భూమిని 1982లో కొనుగోలు చేశారు. 2024 జులైలో స్థలానికి వెళ్లగా ఫెన్సింగ్ వేస్తుండటం చూసి ఆరా తీయగా, తన భూమి వేరే వాళ్ల పేరున రిజిస్ట్రేషన్ అయినట్లు తేలింది. దీంతో ఆయన కీసర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.పోలీసుల విచారణలో సయ్యద్ అఫ్జల్ అనే వ్యక్తి 1988లోనే వెంకట్ రెడ్డి, మహమ్మద్ ఇక్బాల్ పేర్లతో మారేడ్పల్లి ఎస్ ఆర్ ఓ లో నకిలీ జిపిఏ సృష్టించినట్లు బయటపడింది. అందులో ఫోటోలు, సంతకాలు, వేలిముద్రలు అన్నీ ఫోర్జరీ చేశారు. బుధవారం ప్రధాన నిందితుడు బసరికారి శ్రీనివాస్ రావు తో పాటు బార్లపాటి ఆనంద్, బొర్రా వెంకటేష్, మిర్ సాదిక్ అలీ, రామిడి సత్తి రెడ్డిలను అరెస్ట్ చేశారు.వీరు నకిలీ జిపిఏ ఆధారంగా సర్వే నెం.94 లోని ప్లాట్ నెం.21, 28, 38, 59, 129, 145లను సేల్ డీడ్ లు, అగ్రిమెంట్ కం జిపిఏ లుగా అమ్మకం చేశారు. నకిలీ అని తెలిసీ మిగతా నలుగురు సాక్షి సంతకాలు పెట్టి డబ్బులు తీసుకున్నారు.ఈ దందాలో మధ్యవర్తులుగా తటాకం నారాయణ శర్మ, జూపల్లి రవీందర్ వ్యవహరించారని, వారి కోసం గాలింపు చేస్తున్నామని ఏ సి పీ తెలిపారు. నిందితులపై బిఎన్ఎస్ 318(4), 336(3), 338, 319(2), 340(2) కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. జవహర్ నగర్ ఏసిపి ఎస్.చక్రపాణి పర్యవేక్షణలో కీసర ఇన్స్పెక్టర్ బిక్కి రమేష్, ఎస్సై అనిల్ కుమార్ ఈ కేసును ఛేదించారు.

# జలసిరి నీటి కుంటల్లో గంగపుత్రులకు చేపల పెంపకానికి అవకాశం కల్పించాలి

**- టిజిఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట వ్యాప్తంగా జలసిరి పథకం కింద నిర్మించనున్న సుమారు 50,000 నీటి కుంటల్లో సంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రులకు చేపల పెంపకం, మత్స్యకార వృత్తి నిర్వహణకు అవకాశం కల్పించి, వారి జీవనోపాధిని మరింత మెరుగుపరచాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా కోరారు.ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట మత్స్యశాఖ డైరెక్టర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. మురళీకృష్ణను కలిసి గంగపుత్ర సంఘం తరపున వినతి పత్రం సమర్పించారు.రాష్ట్రంలో తరతరాలుగా మత్స్యకార వృత్తినే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న గంగపుత్ర కుటుంబాలకు జలసిరి పథకం ద్వారా నిర్మించనున్న నీటి కుంటలు ఉపాధి అవకాశాలుగా మారేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాజేష్ ఖన్నా విజ్ఞప్తి చేశారు నీటి కుంటల్లో చేపల పెంపకం, సంరక్షణ, వేట తదితర మత్స్యవృత్తి కార్యకలాపాల్లో సంప్రదాయ మత్స్యకారులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.ఈ కుంటలను స్థానిక గంగపుత్ర మత్స్యకార సంఘాలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారికి స్థిరమైన ఉపాధి, ఆదాయ వనరులు ఏర్పడి, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు సంప్రదాయ మత్స్యకార వృత్తి పరిరక్షణకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం గంగపుత్రుల అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించి, జలసిరి పథకంలోని నీటి కుంటల్లో చేపల పెంపకం మరియు మత్స్యకార వృత్తి నిర్వహణకు తగిన విధంగా అవకాశాలు కల్పించాలని తెలంగాణ గంగపుత్ర సంఘం తరపున కోరారు.

# ఈసారి వైసీపీకి ఆ 11 సీట్లు కూడా రావు

**- ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా కూటమిదే విజయం: నాదెండ్ల మనోహర్**



**ఏలూరు(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈవీఎం అయినా.. బ్యాలెట్ పేపర్ అయినా కూటమి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన 11 అసెంబ్లీ స్థానాలు కూడా ఈసారి దక్కవని వ్యాఖ్యానించారు.గురువారం ఏలూరు జిల్లా సమీక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, వ్యవసాయం, ఉద్యానవనం, ఐటీ, ఆహార శుద్ధి, గ్రీన్ ఎనర్జీ, పర్యాటక రంగాల్లో అభివృద్ధి వేగం పుంజుకుందని తెలిపారు. మూడు ఆర్థిక జోన్ల ద్వారా అన్ని ప్రాంతాలకూ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు. గూగుల్ డేటా సెంటర్, క్వాంటం వ్యాలీ వంటి పెట్టుబడులతో రాష్ట్రం సాంకేతిక రంగంలో ముందుకు సాగుతోందని చెప్పారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, రక్షిత మంచినీటి వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆలోచనలతో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తోందన్నారు.

**పరిశ్రమలు తరలిపోవడానికి వైసీపీనే కారణం** 2019--24 మధ్య వైసీపీ పాలనలో రాయలసీమ నుంచి పలు పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని మనోహర్ ఆరోపించారు. పారిశ్రామికవేత్తలను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వల్ల పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారని విమర్శించారు కియా అనుబంధ పరిశ్రమలు, అమరరాజా, జాకీ, ఏషియా పల్ప్ పేపర్, రిలయన్స్ వంటి పెట్టుబడి ప్రతిపాదనల విషయంలో అప్పటి ప్రభుత్వం అనుసరించిన విధానం కారణంగానే రాష్ట్రానికి నష్టం జరిగిందని ఆరోపించారు. అమరరాజా రూ.9,500 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చినా సహకారం లభించక తెలంగాణకు వెళ్లిందన్నారు. రేణిగుంటలో రూ.7,500 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదించిన రిలయన్స్‌కు భూమి కూడా కేటాయించలేదని విమర్శించారు.

**బ్యాలెట్ అయినా.. ఈవీఎం అయినా సిద్ధమే** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని మనోహర్ అన్నారు. "ప్రజలు వైసీపీ నాయకుల తీరును గమనిస్తున్నారు. 2024లో 11 సీట్లు ఇచ్చినందుకు ఇప్పుడు పునరాలోచించే పరిస్థితి వచ్చింది. ఈసారి ఆ 11 సీట్లు కూడా రావు. ఈవీఎం అయినా.. బ్యాలెట్ పేపర్ అయినా కూటమిదే ఘన విజయం" అని పేర్కొన్నారు. సమావేశంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# రైతుబజార్ కౌంటర్.. నెలలో రెండు మూడు రోజులేనా.?



నగరి(ప్రశ్న న్యూస్) నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సన్నబియ్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువకు అందించేందుకు నగరిలో ఏర్పాటు చేసిన రైతుబజార్ కౌంటర్ సక్రమంగా పనిచేయడం లేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. ఆగస్టు 3న ప్రారంభించిన ఈ కౌంటర్ నెలలో రెండు, మూడు రోజులు మాత్రమే తెరుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.సన్నబియ్యం కోసం రైతుబజార్ కౌంటర్‌కు వచ్చే ప్రజలకు తరచూ తలుపులు మూసి ఉండటంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్కువ ధరకు బియ్యం అందించాలనే ఉద్దేశంతో కౌంటర్ ఏర్పాటు చేసినా.. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోందని విమర్శించారు.ఈ మేరకు నగరి ఆర్డీవోకు సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కౌంటర్‌ను క్రమం తప్పకుండా తెరిచి, సన్నబియ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సీపీఐ టౌన్ సెక్రటరీ వాలన్, జిల్లా సమితి సభ్యులు షబ్బీర్‌భాష, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# దర్శికి డిగ్రీ కళాశాల భవనాలు

**- లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన : టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ**



మంగళగిరి(ప్రశ్న న్యూస్) దర్శి డిగ్రీ కళాశాలకు భవనాలు మంజూరు చేయడంపై టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా డిగ్రీ కళాశాల విద్యార్థులు సొంత భవనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లక్ష్మీ తెలిపారు. భవనాల మంజూరుతో దర్శి ప్రాంత విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, విద్యాభివృద్ధికి అందించిన సహకారాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పేర్కొన్నారు.

**దర్శిలో క్రికెట్ స్టేడియం అభివృద్ధి**
గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు పీపీపీ విధానంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో దర్శిలో క్రికెట్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు లక్ష్మీ వివరించారు. ఈ విషయం తెలుసుకున్న లోకేష్ అభినందిస్తూ ప్రోత్సహించినట్లు తెలిపారు.డిగ్రీ కళాశాల భవనాలతోపాటు క్రికెట్ స్టేడియం ప్రారంభోత్సవాలకు దర్శికి రావాలని లోకేష్‌ను ఆమె ఆహ్వానించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మీ వెల్లడించారు.ఐక్యంగా పనిచేయాలిపార్టీ కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేస్తూ విజయమే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని లోకేష్ సూచించినట్లు లక్ష్మీ తెలిపారు. పార్టీ కార్యకర్తలకు కేంద్ర కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా లోకేష్ పలువురిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. శిక్షణలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీని కూడా అభినందించారు.

# అవినీతి, ఇసుక మాఫియాపై వైసీపీదే పేటెంట్

**- కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం తగదు**

**- రాయలసీమ తాగునీటికి రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార**

**- రోజా వ్యాఖ్యలు అర్థరహితం: చిల్లపల్లి శ్రీనివాసరావు**

**- పవన్ పనితీరుకు గ్రామీణాభివృద్ధే నిదర్శనం: కోన తాతారావు**



**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే వైసీపీ నాయకులు ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం వైసీపీ నాయకులకు మింగుడుపడటం లేదన్నారు. గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో విశాఖపట్నం డీసీసీబీ చైర్మన్ కోన తాతారావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

**రాయలసీమకు తాగునీటే లక్ష్యం** రాయలసీమను అభివృద్ధికి వేదికగా మార్చడంతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు దక్కుతుందని చిల్లపల్లి పేర్కొన్నారు. రాయలసీమకు పవన్‌కల్యాణ్ ఏం చేశారని ప్రశ్నిస్తున్న వైసీపీ నేతలు.. తమ ఐదేళ్ల పాలనలో ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.జల్‌జీవన్ మిషన్ అమలులో గతంలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రంతో చర్చించి, పథకం గడువును 2028 వరకు పొడిగించేలా కూటమి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. రాయలసీమలోని వేలాది ఆవాసాలకు తాగునీరు అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ఎయిమ్స్‌లో రోగికి పరీక్షలే పరీక్షలు

- ఓపీ కోసం గంటల తరబడి నిరీక్షణ..
- విభాగాల వద్ద సెక్యూరిటీ ఆంక్షలు
- సిబ్బంది తీరుపై రోగులు, బంధువుల ఆవేదన..పైరవీలపై ఫిర్యాదులు
- 'అయినవారికి ఆకుల్లో.. కానివారికి కంచాల్లో' అన్న విమర్శలు



**గుంటూరు/ మంగళగిరి (ప్రశ్న న్యూస్)** అత్యాధునిక వైద్య సదుపాయాలు.. నిపుణులైన వైద్యులు.. పేదలకు మెరుగైన వైద్యం.. ఎయిమ్స్ అంటే ప్రజలకు కనిపించే చిత్రం ఇది. అయితే ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మాత్రం ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఓపీ టోకెన్ నుంచి వైద్య విభాగానికి చేరుకునే వరకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఓపీ అంటేనే ఓపిక పరీక్ష!

వైద్యం కోసం వచ్చిన రోగికి మొదటి సమస్య ఓపీ వద్దే మొదలవుతోందన్న ఫిర్యాదులు ఉన్నాయి. గంటల తరబడి నిరీక్షణ, టోకెన్ కోసం క్యూలు, వైద్యుడిని కలిసే సమయంపై స్పష్టత లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. 'వైద్యం కోసం వచ్చామా.. ఓపిక పరీక్ష రాయడానికి వచ్చామా?' అన్న పరిస్థితి ఉందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

## సీనియర్ వైద్యులు ఎక్కడ.?

కీలక విభాగాల్లో సీనియర్ వైద్యుల అందుబాటుపైనా రోగులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. వైద్యుడిని కలిసేందుకు సరైన సమాచారం లేకపోవడం, ఎక్కువసేపు వేచి ఉండాల్సి రావడం వంటి సమస్యలు ఉన్నాయని చెబుతున్నారు. వైద్యుల హాజరు, ఓపీ సమయాలపై స్పష్టమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

## సెక్యూరిటీ ఆంక్షలెందుకు.?

వైద్య విభాగాల్లోకి వెళ్లాలంటే సెక్యూరిటీ అనుమతి అవసరమవుతున్న సందర్భాలపై రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భద్రతా నిబంధనలు అవసరమే అయినా అవి రోగులకు వైద్యం అందుకోవడంలో అడ్డంకిగా మారకూడదని అంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, బంధువులు ఎవరిని సంప్రదించాలో స్పష్టమైన విధానం ఉండాలని కోరుతున్నారు.

## దురుసు ప్రవర్తనపై ఫిర్యాదులు

సెక్యూరిటీ సిబ్బంది రోగులు, బంధువులతో దురుసుగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. బాధలో ఉన్నవారికి మార్గనిర్దేశం చేయాల్సింది పోయి గట్టిగా మాట్లాడటం, అనవసరంగా అడ్డుకోవడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని కొందరు చెబుతున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి రోగులతో వ్యవహరించే విధానంపై శిక్షణ, పర్యవేక్షణ అవసరమని అంటున్నారు.

## పైరవీలకు చోటుందా.?

సాధారణ రోగులు గంటల తరబడి వేచి ఉండగా పరిచయాలున్న వారికి త్వరగా సేవలు అందుతున్నాయన్న ఫిర్యాదులు కూడా వినిపిస్తున్నాయి. ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది ద్వారా తమ పరిచయస్తులకు ప్రత్యేక సహకారం అందుతోందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని రోగుల బంధువులు కోరుతున్నారు. అందరికీ ఒకే విధమైన వైద్యసేవలు అందుతున్నాయా? అన్నది తేలాల్సి ఉంది.

## 'దొడ్డిదారి' సేవలపై నిఘా ఏది.?

నిబంధనలకు విరుద్ధంగా కొందరికి ప్రత్యేక మార్గంలో వైద్యసేవలు అందుతున్నాయన్న ఆరోపణలు వస్తే వాటిపై యాజమాన్యం దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. ఎవరికైనా ప్రత్యేక ప్రవేశం లేదా ప్రాధాన్యత కల్పిస్తున్నారా? అనే అంశంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అంటున్నారు.

## డబ్బులు.. వస్తువుల డిమాండ్లపై చర్యలెప్పుడు.?

సిబ్బంది పేరుతో డబ్బులు, వస్తువులు అడుగుతున్నారన్న ఫిర్యాదులు ఉంటే వాటిపై విచారణ జరపాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని, అబద్ధమైతే వాటికి కారణమైన అపోహలను తొలగించాలని రోగులు కోరుతున్నారు. అధికారిక చెల్లింపులకు రసీదులు తప్పనిసరి చేసి, అనధికార వసూళ్లకు అవకాశం లేకుండా చూడాలని అంటున్నారు.

## 'అయినవారికి ఆకుల్లో.. కానివారికి కంచాల్లో'

వైద్యసేవల్లో సమానత్వం అత్యంత కీలకం. పరిచయాలు, పలుకుబడి ఆధారంగా సేవల్లో తేడా ఉండకూడదు. అయితే పరిచయాలున్న వారికి వేగంగా సేవలు, సాధారణ రోగులకు దీర్ఘ నిరీక్షణ అన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో యాజమాన్యం పారదర్శకతను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

## వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి?

వృద్ధులు, దివ్యాంగులు, అత్యవసర రోగులకు ప్రత్యేక సహాయక వ్యవస్థ ఎంతవరకు పనిచేస్తోందన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీరికి ప్రత్యేక క్యూలు, మార్గదర్శక సిబ్బంది, వేగవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

సమాచారం కోసం రోగుల పరుగులుఏ విభాగం ఎక్కడ ఉంది.? ఏ వైద్యుడిని ఎప్పుడు కలవాలి.? రిపోర్టులు ఎక్కడ చూపించాలి.? వంటి కనీస సమాచారం కోసం రోగులు సిబ్బందిని వెతుక్కుంటూ తిరగాల్సి వస్తోందన్న ఫిర్యాదులు ఉన్నాయి. స్పష్టమైన సూచిక బోర్డులు, సమాచార కేంద్రాలను మరింత సమర్థంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఏది.?

సిబ్బంది ప్రవర్తనపై ఫిర్యాదు చేయాలంటే ఎవరిని సంప్రదించాలి.? ఫిర్యాదు చేసిన తర్వాత చర్య ఏమిటి.? అన్న దానిపై రోగులకు స్పష్టత అవసరం. ఫిర్యాదులపై వేగంగా స్పందించే పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలిఎయిమ్స్ వంటి జాతీయ స్థాయి వైద్య సంస్థపై ప్రజలకు భారీ అంచనాలు ఉన్నాయి. అందుకే రోగుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఉన్నతాధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఓపీ నిర్వహణ, వైద్యుల అందుబాటు, సెక్యూరిటీ వ్యవహారం, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనితీరు, పైరవీల ఆరోపణలు, అనధికార వసూళ్లపై పర్యవేక్షణను బలోపేతం చేయాలని రోగులు కోరుతున్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుకు రుసుము లేదు

- డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు: ఏఎస్ఓ చాముండేశ్వరి





**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డు జారీ కోసం ప్రజలు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని సర్కిల్-9 ఏఎస్ఓ అధికారి చాముండేశ్వరి స్పష్టం చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల కోసం రూ.100 వసూలు చేస్తున్నారంటూ ప్రజా ప్రశ్న దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. కార్డు జారీ ప్రక్రియ పూర్తిగా ఉచితమని తెలిపారు. అధికారులు, సిబ్బంది లేదా ఇతరులు ప్రజల నుంచి డబ్బులు తీసుకుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రుసుము పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఓ హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..

## బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి



ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ పట్టణంలో రద్దీగా ఉన్న ఒక బస్టాప్‌పై జరిగిన రాకెట్ దాడిలో 33 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడగా, ఈ ఘోర దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ దాడి ధాటికి బస్టాప్ పరిసరాలన్నీ రక్తసిక్తమయ్యాయి. మృతదేహాలు, శిథిలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఏడాదిలో రష్యా జరిపిన దాడుల్లో పౌరులు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ ఘాతుకానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. "ఇది ముమ్మాటికీ ఉగ్రవాద చర్య. దీనికి తగిన ప్రతీకారం తీర్చుకుంటాం" అని ఆయన హెచ్చరించారు. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న రష్యాపై అంతర్జాతీయ సమాజం ఒత్తిడి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనతో ఇరు దేశాల మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

# చిన్న సమస్యలు - పెద్ద చికిత్సలు

- ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన నకిలీ వైద్యులు - అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, ప్రమాదకర ఇంజెక్షన్లతో చికిత్సలు
- అధిక మోతాదులో మందులు వాడటం వల్ల రోగనిరోధక శక్తి కోల్పోతున్నారు
- చిన్న సమస్య అయినను వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకోవాలి, సొంత వైద్యం ప్రాణాంతకం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** చిన్నచిన్న ఆరోగ్య సమస్యలైన జలుబు, దగ్గు, కడుపునొప్పి ఎసిడిటీ వంటివి వాటికి సైతం అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, మందులు వాడటం వల్ల శరీరంపై దుష్ప్రభావాలు పడే ప్రమాదం పొంచి ఉందని పలువురు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ఆరోగ్య సమస్యలను సహజసిద్ధమైన పద్ధతుల్లో జీవనశైలి మార్పుల ద్వారా సులభంగా నయం చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అయితే చిన్న జబ్బులేనని వైద్యుల సలహా లేకుండా సొంత వైద్యంతో మందుల షాపుల్లో దొరికే యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడటం వల్ల కాలేయం, కిడ్నీలపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు. సాధారణ జలుబు వంటివి వైరల్ ఇన్ఫెక్షన్లు మన శరీర రోగనిరోధక శక్తి ద్వార 5 నుండి 7 రోజుల్లో దానంతట అదే తగ్గుతాయని, వీటికి కేవలం ఉపశమనం ఇచ్చే చికిత్సలు సరిపోతాయని సూచిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో చిన్న చిన్న ఆరోగ్యసమస్యలకు సొంత వైద్యం చేసుకోవడం, లేదా గ్రామాల్లోని ఆర్ఎంపీల వద్ద చికిత్సలు చేయించుకోవడం వల్ల చిన్న సమస్యలు పెద్ద సమస్యగా మారి ప్రాణాలు కోల్పోతున్నా సంఘటనలు ప్రతినిత్యం జరుగుతున్నాయి.

## మిడిమిడి జ్ఞానంతో చికిత్సలు

వ్యాపారంమయమైన వైద్యవృత్తి ఒక పెద్ద మాఫియాగా మారిందని, మిడిమిడి పరిజ్ఞానంతో వైద్యులుగా చలామణి అవుతు పేదరోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కేవలం పదవ తరగతి వరకు కూడా చదువుకోని వారు సైతం అంగట్లో దొరుకుతున్న ఆర్ఎంపీ, పిఎంపీ పట్టాలను కొనుక్కొని పెద్ద డాక్టర్లుగా చలామని అవుతు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలపై తమ వద్దకు వచ్చే పేద రోగులకు అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, సలేన్లతో చికిత్సలు చేస్తు రోగుల నుండి భారీగా డబ్బులు గుంజుడమే కాక అధిక మోతాదులో యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడించడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు ప్రాథమిక వైద్య సేవల పేరుతో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, ప్రమాదకరమైన ఇంజక్షన్లతో చికిత్సలు చేస్తున్న నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు అలసత్వం చూపుతున్నారని, దీనికి కారణం నకిలీల నుండి నెల నెల వస్తున్న లంచాలకు అలవాటుపడిన అధికారులు ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టి నకిలీలకు వంత పాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తమ వద్దకు వస్తున్న వారి ఆరోగ్య సమస్యపై పూర్తి స్థాయిలో అవగాహన లేక పోయినను జబ్బుకు సంబంధంలేని మందులు, ఇంజెక్షన్లతో చికిత్స మొదలుపెట్టి అత్యవసర పరిస్థితుల్లో చేతులేత్తేయడంతో రోగుల పరిస్థితి ఆందోళనకరంగా మారి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు నిత్యం జరుగుతూనే వున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ వైద్యుల ఆగడాలపై వైద్యఆరోగ్యశాఖాధికారులు దృష్టి సారించి డాక్టర్లుగా చలామని అవుతున్న నకిలీ వైద్యుల అర్హతలు, చికిత్సలు, వాడుతున్న మందులపై పూర్తిస్థాయిలో విచారించి కఠిన చర్యలు తీసుకోని నకిలీల భారి నుండి పేద ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588